VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 02.08.2026

సంపుటి : 09 సంచిక : 54 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



4

## ఉజ్జయిని మహాకాళి బోనాలకు సర్వం సిద్ధం

- సికింద్రాబాద్ బోనాల జాతరకు ముమ్మర ఏర్పాట్లు
- నేటి నుంచి ఆగస్టు 4 వరకు నగరంలో రూట్ మళ్లింపులు

# భోగాపురంతో ఉత్తరాంధ్రకు కొత్త ఊపు..

రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం

## చంద్రబాబు విజన్‌ను ప్రశంసించిన మోదీ

- భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం
- రూ.18 వేల కోట్ల ప్రాజెక్టుల ప్రారంభం
- స్వర్ణాంధ్రకు శుభదినమన్న ప్రధాని
- ఉత్తరాంధ్రకు కొత్త రన్‌వే అన్న ప్రధాని
- డబుల్ ఇంజిన్‌తో డబుల్ స్పీడ్ అభివృద్ధి
- పెట్టుబడులకు ఏపీ కీలక కేంద్రంగా మారుతోందని వ్యాఖ్య





**విజయనగరం, వెలుతురు, ఆగస్టు 1:**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో శనివారం కీలకమైన ఘట్టం చోటుచేసుకుంది. విజయనగరం జిల్లా భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. ఇదే వేదికపై రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, భవిష్యత్ పెట్టుబడులపై ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రసంగాన్ని "అందరికీ నమస్కారం" అంటూ తెలుగులో ప్రారంభించిన మోదీ..

▶ మిగతా 2లో

# బట్టకాల్చి మీద వేస్తానంటే ఊరుకునే ప్రసక్తే లేదు

- అవినీతికి తావులేకుండా ప్రజలకు సేవలందిస్తున్నాం
- యూఐడీఎఫ్ నిధుల టెండర్లతో మాకు సంబంధమే లేదు
- టెండర్ల వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది
- అవినీతి బురదలో కూరుకు పోయిన వాళ్లే బురద చల్లుతుంటే చూస్తూ ఊరుకోవాలా?
- అట్లాంటి వారికి లీగల్ నోటీసులు ఇవ్వండి
- క్షమాపణ చెప్పకపోతే కోర్టుకీడ్చండి
- తప్పుడు కూతలు కూసే వారికి చెంప చెల్లుమనేలా చర్యలుండాలి
- మేయర్, డిప్యూటీ మేయర్లకు బండి సంజయ్ ఆదేశం



2

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:**

గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

▶ మిగతా 2లో



# నామినేటెడ్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్ కసరత్తు

- గాంధీ భవన్‌లో కీలక సమావేశం
- పీఏసీఎస్ డైరెక్టర్లు, చైర్మన్ల ఎంపికపై చర్చ
- 60 శాతం పోస్టులు పార్టీ సీనియర్లకు ఇవ్వాలని నిర్ణయం
- సామాజిక వర్గాలకు ప్రాధాన్యతపై స్పష్టత
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



3

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:**

గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన శనివారం కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. రానున్న వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) డైరెక్టర్లు, చైర్మన్ల ఎంపికతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించిన విధివిధానాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

- అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ
- పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
- నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు
- భూముల ధరణ సవరణతో స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ల ఆదాయం 20% వరకు పెరుగుదల
- త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం
- కేంద్రం నిధులు ఇవ్వక పోయినా ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లులు చెల్లిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



7

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా — ప్రపంచ తల్లి పాల వారోత్స వాలను విజయవంతం చేయాలి

- పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలి తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలి
- అంగన్వాడీ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలి

– మంత్రి సీతక్క



4

## వ్యవసాయ మార్కెట్లలో పూర్తి స్థాయి డిజిటలీకరణకు చర్యలు



2

- అక్రమాలకు తావులేకుండా మార్కెటింగ్ శాఖను పారదర్శకంగా తీర్చిదిద్దాలి
- అభివృద్ధి పనులన్నీ నిర్దేశించుకొన్న లక్ష్యం వరకు పూర్తి చేయాలి
- అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు
- 3 నెలల్లో పూర్తి చేయాలి

## తెలంగాణ రైజింగ్2047'లో భాగస్వామ్యం అవ్వండి

- ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమ గ్రాభివృద్ధి
- సీఎస్ఆర్ ద్వారా కీలక పాత్ర పోషించాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపు
- 'సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'లో మంత్రి శ్రీధర్ బాబు



2

## హైడ్రా అభివృద్ధితో జలకళ సంతరించుకున్న ఉప్పల్ నల్లచెరువు

- వర్షాలతో నిండిన నల్లచెరువు
- హైడ్రా అభివృద్ధి పనుల ఫలితం
- 10 ఎకరాల ఆక్రమణల తొలగింపు
- రూ.20 కోట్లతో సమగ్ర అభివృద్ధి
- ఇన్లెట్లు, ఔట్లెట్ల నిర్మాణం
- వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు



4

## మోదీ చేతుల మీదుగా ఏపీలో మెగా ప్రాజెక్టులు

- సెమీకండక్టర్ యూనిట్‌కు శ్రీకారం
- భోగాపురం నుంచి అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం
- తొలి సెమీకండక్టర్ యూనిట్‌కు శంకుస్థాపన
- పలు జాతీయ రహదారి ప్రాజెక్టుల ప్రారంభం
- సోలార్ విద్యుత్ ప్రాజెక్టులకు ఊతం



2

# తెలంగాణ రైజింగ్-2047'లో భాగస్వామ్యం అవ్వండి



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:**

కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) ద్వారా 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టిగా కృషి చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ), హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో కొండాపూర్ లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న '50వ సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 'తెలంగాణ రైజింగ్-2047' అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సాకారమయ్యే అభివృద్ధి విజన్ అని వివరించారు. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక పురోగతి సమాంతరంగా సాగేలా... ఆవిష్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేలా... అభివృద్ధి ప్రతి నియోజకవర్గానికి, దాని ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం... పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ రంగం భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సీఎస్ఆర్ ద్వారా సమాజంలో మార్పు తెచ్చే కార్యక్రమాల అమలుకు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రతి దశలోనూ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భాగస్వామిగా, సహాయకారిగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఏఐ, డేటా గవర్నెన్స్, సైబర్ భద్రత వంటి అంశాలు కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలు... కేవలం కంప్లయన్స్ నిపుణులుగా కాకుండా స్ట్రాటజిక్ బోర్డ్ అడ్వైజర్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు కేవలం లాభార్జనే కాకుండా... సస్టైనబుల్, ఎథికల్ వ్యాపార వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కాన్స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్( సీడీఎక్స్)కు నాలెడ్జ్ పార్ట్ నర్ గా ఉండేందుకు ముందుకొచ్చిన ' ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్పోరేట్ కంపెనీలు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు మహదేవ్ తిరునగరి, ఎం.దామోదరన్, శిల్పా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# భోగాపురంతో ఉత్తరాంధ్రకు...

**(మొదటి పేజీ తరువాయి)**

సింహాచలం అప్పన్న స్వామి, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు తెలిపారు. పవిత్రమైన ఉత్తరాంధ్రకు రావడం తన అదృష్టమని చెప్పారు.స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌కు ఇది శుభదినమని పేర్కొన్నారు.ఈ రోజు ప్రారంభించిన రూ.18 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపిస్తాయని ప్రధాని అన్నారు. మౌలిక వసతులు, రవాణా, పారిశ్రామిక రంగాల్లో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని చెప్పారు.సభకు ముందు నిర్వహించిన గిరిజన సంప్రదాయ నృత్యం 'థింసా' తనను ఎంతో ఆకట్టుకుందని ప్రధాని పేర్కొన్నారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు నృత్యం చేయడం అద్భుతమని కొనియాడారు. అభివృద్ధితో పాటు సంప్రదాయ సంస్కృతిని కాపాడుతున్న ఆంధ్రప్రదేశ్‌ను అభినందించారు.భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా, రాష్ట్ర యువత భవిష్యత్తుకు కొత్త లాంచ్‌పాడ్‌గా నిలుస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. పర్యాటకం, పరిశ్రమలు, ఎగుమతులు, ఉపాధి అవకాశాలకు ఈ విమానాశ్రయం దోహదపడుతుందని చెప్పారు.గతంలో విమానాశ్రయాలకు ఒకే కుటుంబం పేర్లు పెట్టేవారని విమర్శించిన ప్రధాని.. తమ ప్రభుత్వం దేశ చరిత్రలో నిలిచిన మహనీయుల పేర్లను విమానాశ్రయాలకు పెడుతోందని చెప్పారు. అయోధ్య విమానాశ్రయానికి వాల్మీకి, పంజాబ్‌లోని విమానాశ్రయానికి సంత్ రవిదాస్, భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టామని గుర్తు చేశారు.2014కు ముందు దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండేవని, గత 12 ఏళ్లలో వాటి సంఖ్య 166కు చేరిందని మోదీ తెలిపారు. ఉడాన్ పథకం ద్వారా విమాన ప్రయాణాన్ని సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలు తమ ప్రాంతాల నుంచే విమానాల్లో ప్రయాణించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు.దేశంలో బ్లూ ఎకానమీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని తెలిపారు. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు ఉన్న పోర్టులను అభివృద్ధి చేస్తూనే, మూలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులను నిర్మిస్తున్నామని చెప్పారు. పోర్టులతో పాటు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు కూడా రాష్ట్ర అభివృద్ధికి వేగం పెంచుతున్నాయని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం రూ.లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని మోదీ వెల్లడించారు. సాఫ్ట్‌వేర్, ఐటీ రంగాల్లో తెలుగువారి ప్రతిభ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని కొనియాడారు. ఆ ప్రతిభను దేశ అభివృద్ధికి మరింత ఉపయోగపడేలా అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ తయారీ రంగానికి ప్రధాన కేంద్రంగా మారుతోందని ప్రధాని అన్నారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని, సెమీకండక్టర్, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా పనులు సాగుతున్నాయని తెలిపారు. నక్కపల్లిలో భారీ ఫార్మా ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని చెప్పారు.డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల వల్లే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి డబుల్ స్పీడ్‌తో ముందుకు సాగుతోందని మోదీ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతూ , అభిషేక్ సింగ్వి లాంటి మంచి న్యాయవాదులను నియమించి సుప్రీంకోర్టు లో న్యాయపరంగా సమర్థవంతంగా పోరాడిన ఫలితంగానే ఈ తీర్పు వచ్చిందన్నారు. గౌరవెల్లి, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఈ తీర్పు కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని, రైతులకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని మంత్రి తెలిపారు.తెలంగాణ హక్కులను పరిరక్షించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తీసుకున్న చొరవ, ప్రభుత్వం చేసిన న్యాయపోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ గారు అభినందించారు.

# బట్టకాల్చి మీద వేస్తానంటే ఊరుకునే ప్రసక్తే లేదు

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 01:**

"గత పదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు, అరాచకాలతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను భ్రష్టు పట్టించిన నాయకులే మనకు అవినీతి మరకలు అంటించాలని చూస్తున్నారు. మనకు సంబంధం లేని విషయంలోనూ బట్ట కాల్చి మీదేస్తున్నారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన పనిలేదు. అట్లాంటి వాళ్లను ఉపేక్షించాల్సిన అవసరమే లేదు. వెంటనే లీగల్ నోటీసులు పంపండి. క్షమాపణ చెప్పకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకోండి" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంగనర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులను ఆదేశించారు. యూఐడీఎఫ్ నిధులకు సంబంధించిన టెండర్ల వ్యవహారంలో తమకు ఏ మాత్రం సంబంధం లేదని, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని చెప్పారు. అయినప్పటికీ కొందరు బీఆర్ఎస్ నేతలు కావాలనే తమపై అవినీతి బురద చల్లాలని చూస్తున్నారని చెప్పారు. అట్లాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

శనివారం రోజున కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో యూఐడీఎఫ్ నిధుల అంశం, టెండర్ల వ్యవహారంపై చర్చించారు. ఈ విషయంలో తమకు సంబంధం లేనప్పటికీ పదేపదే బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తూ కావాలని బీజేపీ ప్రతిష్టను దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారని కొలగాని, సునీల్ రావు బండిసంజయ్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పందిస్తూ "యూఐడీఎఫ్ నిధుల టెండర్ల వ్యవహారం మనకు ఏమాత్రం సంబంధం లేదు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది. ఆ టెండర్లో మనకు సంబంధమేంటి? కావాలనే బట్టకాల్చి మీదేయాలనుకుంటున్నారు. గతంలో మున్సిపల్ కార్పొరేషన్ ను ఏలిన వాళ్లు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయి, ప్రతి పనికీ లంచాలకు అలవాటుపడ్డారు. ఇతరుల మీద కూడా అట్లాంటి బురద చల్లాలనుకుంటున్నారు. వాళ్లను ఉపేక్షించొద్దు. వెంటనే లీగల్ నోటీసులివ్వండి. క్షమాపణ చెప్పకపోతే న్యాయపరమైన చర్యలకు సిద్ధం కండి"అని సూచించారు.

బీఆర్ఎస్ అవినీతి, అరాచక పాలనతో విసిగిపోయిన కరీంనగర్ కార్పొరేషన్ ప్రజలు బీజేపీని గెలిపించారని కేంద్ర మంత్రి చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అవినీతికి తావులేని విధంగా ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తుంటే ఓర్వలేకపోతున్నారని తెలిపారు. "తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడకూడదన్నదే మా విధానం. అదే సమయంలో నోటికి వచ్చినట్లు వాగుతూ అబద్దాలను ప్రచారం చేస్తూ ఏ తప్పు చేయకపోయినా మాపై అవినీతి బురద చల్లేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అట్లాంటి వారిపై చట్ట, న్యాయపరమైన చర్యలకూ వెనుకాడబోం.

యూఐడీఎఫ్ నిధులకు సంబంధించి నిర్వహించిన టెండర్లతో మాకు సంబంధమే లేదు. ఇందులో ఏనాడూ ఇన్‌వాల్వ్ కాలేదు. అయినా మాపై అవినీతి ఆరోపణలు చేస్తూ మా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారు. తక్షణమే వారికి లీగల్ నోటీసులివ్వండి. క్షమాపణ చెప్పకపోతే న్యాయమైన చర్యలకు సిద్ధం కండి."అని మేయర్, డిప్యూటీ మేయర్ లకు స్పష్టం చేశారు.

# వ్యవసాయ మార్కెట్లలో పూర్తి స్థాయి డిజిటలీకరణకు చర్యలు

- **కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణ పనులలో మాసం వారి పురోగతి నిర్దేశించుకొని ముందుకెళ్లాలి**
- **అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:**

రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖను లక్ష్యం సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు వేగంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ పనితీరు, అభివృద్ధి పనులు, డిజిటలీకరణ, పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, ఇంజనీరింగ్ పనులు, మార్కెట్ యార్డులలో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, ప్రత్యేక బృందాల తనిఖీలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 206 మార్కెట్ కమిటీలను పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు, టెండర్ ప్రక్రియలను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసి, సెప్టెంబర్ నుంచి అమలు ప్రారంభించాలని సూచించారు.ప్రతి మార్కెట్ కమిటీలో సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ వెయింగ్ స్కేల్స్, గేట్ ఎంట్రీ-ఎగ్జిట్ వ్యవస్థలను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌పై అనుసంధానం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖలో అమలవుతున్న నంబర్ ప్లేట్ స్కానింగ్ విధానాన్ని మార్కెట్ యార్డుల్లో కూడా అమలు చేసి, ప్రతి వాహనం ప్రవేశం, నిష్క్రమణ, తూకం, లావాదేవీలన్నీ డిజిటల్ రూపంలో నమోదయ్యేలా అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని ఐటీ విభాగానికి సూచించారు. ఇకపై మార్కెటింగ్ శాఖలో జరిగే అన్ని కొనుగోళ్లు పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు.ఇటీవల ఏర్పాటు చేసిన ఏడు ప్రత్యేక తనిఖీ బృందాలు ఈ వారం నిర్వహించిన తనిఖీలపై వచ్చే సోమవారం లోగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఆ నివేదికల ఆధారంగా మార్కెటింగ్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ బృందాల పనితీరుకు వారంవారీ టైమ్‌బౌండ్ వ్యవస్థ అమలు చేయాలని స్పష్టం చేశారు.రానున్న పత్తి కొనుగోలు సీజన్‌కు ముందుగానే సమగ్ర సన్నద్ధత అవసరమని పేర్కొన్న మంత్రి, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI), జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు, సంబంధిత అధికారులతో ఆగస్టు మొదటి లేదా రెండో వారంలో సంయుక్త సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. గత రెండు సంవత్సరాల్లో విజిలెన్స్ విభాగం గుర్తించిన లోపాలను దృష్టిలో ఉంచుకొని, గతంలో జరిగిన అక్రమాలకు ఎటువంటి అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధర (MSP) ప్రయోజనం పూర్తిగా రైతులకే అందేలా చర్యలు చేపట్టాలని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కొత్తగా కొనుగోలు చేసే ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు, లిఫ్టర్లు వంటి పరికరాలను కొనుగోలు చేసే ముందు సాంకేతిక పరీక్షలు నిర్వహించి, అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆయా పరికరాలు నిజంగా అవసరమైన జిల్లాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని, ఉపయోగం లేకుండా పరికరాలు కొనుగోలు చేసి మూలన పడేస్తే సంబంధిత కార్యదర్శి, జిల్లా మార్కెటింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మార్కెటింగ్ శాఖలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులన్నింటికీ స్పష్టమైన గడువులు నిర్ధారించి, ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. శాఖలో ఇంజనీరింగ్ సిబ్బంది కొరత వల్ల పనులు ఆలస్యం అయితే, అవసరమైతే ఆ పనులను ఆర్ అండ్ బి (R&B), పంచాయతీరాజ్ (PR) శాఖలకు అప్పగించి వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీసీకి సూచించారు. శాఖకు కేటాయించిన ఇంజనీర్లు విధులకు హాజరుకాకపోతే వారిపై క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి పనికి టైమ్‌బౌండ్ కార్యాచరణ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.మార్కెట్ యార్డుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఇతర సమస్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని శాఖ కార్యదర్శిని ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేయడాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. వచ్చే నెలలోగా అన్ని మార్కెట్ కమిటీల నుంచి ఫీజిబిలిటీ నివేదికలు సేకరించి, సెప్టెంబర్ నుంచి పనులు ప్రారంభించి, నవంబర్ నాటికి అన్ని మార్కెట్ యార్డులు, గోదాముల్లో సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ఏజెన్సీ తయారుచేసిన డిజైన్లను వచ్చే వారంలోగా ఖరారు చేసి, ముఖ్యమంత్రి గారి అనుమతితో వచ్చే నెలలో నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.మార్కెటింగ్ శాఖలో ఇంజనీరింగ్, పరిపాలన విభాగాల్లో ఎక్కడ సిబ్బంది కొరత ఉందో వెంటనే గుర్తించి, అదనపు పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. శాఖ అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని భర్తీ చేసి, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.శనివారం రోజున సచివాలయంలో వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నిర్మల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, శ్రీ శాంభరెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల గౌరవ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు మంత్రి చేపడుతున్న చర్యలను రైతు నాయకులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలు సకాలంలో అందుబాటులో ఉండేలా కంపెనీలను ఆదేశించాలని, అవసరమైన ఎరువులు, ఇతర వ్యవసాయ సామగ్రిని ఆయిల్ పామ్ కంపెనీల ద్వారా తక్కువ ధరలకు సరఫరా చేయాలని కోరారు. అలాగే ఆయిల్ పామ్ తోటలలో విద్యుత్ వైర్ల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రతి మండలంలో కనీసం ఒక ఆయిల్ పామ్ గెలల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఆయిల్ పామ్ రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని, కార్మికుల కొరతను అధిగమించేందుకు యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించాలని, కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, ప్రతి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అధికారులు, కంపెనీలు, రైతులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.తెలంగాణ ప్రాంతం దేశంలోనే ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని, ఆయిల్ పామ్ అధిక ఆదాయం అందించే పంట అని, దీనికి మార్కెటింగ్ సమస్యలు లేవని, ప్రకృతి వైపరీత్యాల ప్రభావం కూడా తక్కువగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అంతర పంటల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం కూడా ఉందన్నారు. రైతులు కోరిన వెంటనే నాణ్యమైన మొక్కలను అందుబాటులో ఉంచేలా ఆయిల్ పామ్ కంపెనీలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

# మోదీ చేతుల మీదుగా ఏపీలో మెగా ప్రాజెక్టులు

- **గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ప్రారంభం**
- **హై లెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన**
- **మౌలిక వసతులకు కేంద్రం ప్రాధాన్యం**

**విజయవాడ, వెలుతురు, ఆగస్టు 1:**

ఉత్తరాంధ్ర పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రారంభించారు. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన అనంతరం వివిధ రంగాలకు చెందిన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు మరికొన్నింటిని ప్రారంభించారు. సెమీకండక్టర్, గ్రీన్ ఎనర్జీ, జాతీయ రహదారులు, వంతెనల నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి.విశాఖపట్నం తుర్లవాడలో ఏఎస్ఐపీ టెక్నాలజీస్ సెమీకండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. కొరియా రిపబ్లిక్‌కు చెందిన ఏపీఏసీటీ భాగస్వామ్యంతో ఏఎస్ఐపీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. ఇది ఆంధ్రప్రదేశ్‌లో తొలి సెమీకండక్టర్ తయారీ కేంద్రం కావడం విశేషం.ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 96 మిలియన్ల సెమీకండక్టర్ చిప్‌ల తయారీ సామర్థ్యం ఏర్పడనుంది. అధునాతన సాంకేతిక రంగంలో పెట్టుబడులతో పాటు అధిక నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభించనున్నాయి.ఇంధన రంగంలో భాగంగా కర్నూలు విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ప్రధాని ప్రారంభించారు. అనంతపురంలో 2,500 మెగావాట్లు, కర్నూలులో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ జోన్ల ట్రాన్స్‌మిషన్ పథకాలను జాతికి అంకితం చేశారు. రూ.820 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని జాతీయ గ్రిడ్‌కు సమర్థంగా అనుసంధానించనున్నాయి.కర్నూలు-4 రెన్యూవబుల్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగం మరింత బలోపేతం కానుంది.జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే, ఖమ్మం-దేవరపల్లి ప్యాకేజీ, తాడిపత్రి నాలుగు లేన్ల బైపాస్ రహదారులను ప్రధాని జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు ప్రయాణ సమయాన్ని తగ్గించనున్నాయి.ఎన్‌హెచ్-565పై పెంచలకోన-ఏర్పేడు మధ్య లింగ సముద్రం వద్ద నిర్మించనున్న హై లెవెల్ వంతెనకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణంతో ఆ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం తగ్గే అవకాశం ఉంది.సెమీకండక్టర్ తయారీ, పునరుత్పాదక ఇంధనం, జాతీయ రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ఈ ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి కీలకంగా మారనున్నాయని అధికారులు భావిస్తున్నారు.

# కరీంనగర్‌లో గల్లీగల్లీని అభివృద్ధి చేస్తా

- మరిన్ని నిధులు తీసుకొస్తా...
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- మేయర్, డిప్యూటీ మేయర్ లతో కలిసి కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- 48వ డివిజన్ లో రూ.కోటి, 19వ డివిజన్ లో రూ.97 లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి
- మొగ్దుంపూర్ లో మహిళా శక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని, సీసీరోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించిన బండి సంజయ్
- శంకుస్థాపనలు...ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బండి సంజయ్ బిజీ బిజీ...





ముక్దంపూర్ మహిళా సంఘం భవనం ప్రారంభత్సవం

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 01:**

కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గల్లీగల్లీని అభివృద్ధి చేస్తానని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బిజీబిజీగా గడిపారు. ఉదయం 9 గంటలకు తన నివాసం వద్దకు వచ్చిన సందర్శకులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్ ఆ తరువాత 10.30 గంటలకు స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.తొలుత 48వ డివిజన్ లోని విద్యానగర్ కురుమవాడలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తోపాటు స్థానిక కార్పొరేటర్ కర్ర పద్మ అనిల్ తో కలిసి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.80 లక్షలు యూఐడీఎఫ్ నిధులు కాగా, మిగిలిన రూ.20 లక్షలు మున్సిపల్ సాధారణ ఫండ్ కు సంబంధించినవి.అనంతరం 19వ డివిజన్ లోని రేకుర్తి ముదిరాజ్ కాలనీకి వెళ్లిన కేంద్ర మంత్రి రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అట్లాగే లక్ష్మీ నరసింహ కాలనీలో రూ.57 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడి నుండి మొగ్దుంపూర్ వెళ్లిన కేంద్ర మంత్రి రూ.10 లక్షల జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళాశక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని స్థానిక సర్పంచ్ శివకుమార్ తో కలిసి ప్రారంభించారు. అట్లాగే రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించారు. అంతకుముందు చింతకుంట వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్వహించిన "వన మహోత్సవం-2026"లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు అధికారులతోపాటు మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి స్వయంగా మొక్కలను నాటారు. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, అధికారులు సైతం మొక్కలు నాటారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ లోని ప్రతి గల్లీగల్లీని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ముఖ్యంగా అభివృద్ధికి అంతగా నోచుకోని నగర శివారు గ్రామాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అందుకోసం కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం. ఇప్పటికే స్మార్ట్ సిటీ కింద 900 కోట్ల రూపాయల నిధులను తీసుకొచ్చి కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దినం. ఇవిగాకుండా అమ్రుత్ 1, 2 కింద 279 కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. అట్లాగే అర్బన్ డెవలెప్ మెంట్ ఫండ్ కింద రూ.50 కోట్లు వచ్చినయ్. వాటితో గల్లీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినం. తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం కేంద్రమే పూర్తిగా 156 కోట్లను మంజూరు చేసింది. శరవేగంగా పనులు జరుగుతున్నాయి.తాజాగా 840 కోట్ల యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ కార్పొరేషన్ రూపురేఖలే మారబోతున్నాయి. కరీంనగర్ లో మోడల్ రోడ్లను నిర్మిస్తాం. స్కై వాక్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను నిర్మిస్తాం, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తాం. కరీంనగర్ శివారు ప్రాంతాల్లోని గల్లీగల్లీలో సీసీ రోడ్లను నిర్మిస్తాం. అభివృద్ధిలో తెలంగాణలోనే కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు సుందర నగరంగా మార్చబోతున్నాం. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తనకు ఓట్లేసి గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తులా క్రుషి చేస్తున్నా. అందుకోసం నా పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే రూ.22 వేల కోట్లు నిధులు ఖర్చు పెట్టిన. పలు అభివృద్ధి పనులు చేసిన. త్వరలోనే వివిధ కేంద్ర పథకాల కింద మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నా.

## గాంధీ భవన్ లో హైదరాబాద్ పార్లమెంట్ ఓటరు సవరణ ప్రక్రియ పై సమీక్ష సమావేశం ..

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:**



సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ , పార్లమెంట్ ఇంచార్జి ఎంపీ మల్లు రవి, డీసీసీ అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు , బిఎల్ఏ సూపర్వైజర్ లు.ఓటరు సవరణ ప్రక్రియ లో హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో మరింత వేగం పుంజుకోవాలని నియోజకవర్గ ఇంచార్జి లు ఎప్పటికప్పుడు బిఎల్ఏ ల సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఒక ఓటు కూడా పోకుండా జాగ్రత్తగా ఉండాలని దిశా నిర్దేశం.ఆగస్టు 10 వ తేదీ వరకు ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి ఆన్లైన్ అయ్యేలా చూసుకోవాలని ఆదేశాలు.గుర్తించిన అనమాలిస్ ఓటర్ల తో మాట్లాడి వారి ఓటు ఎక్కడ ఫైనల్ చేసుకుంటారో చూసుకోవాలన్నారు.

## కామన్వెల్త్ గేమ్స్‌లో అస్మితా దే స్వర్ణ పతకం సాధించడం హర్షణీయం: టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:**



కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళల 48 కిలోల జూడో విభాగంలో భారత జూడో క్రీడాకారిణి అస్మితా దే స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించడం పట్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, భారత జూడో చరిత్రలో తొలిసారిగా కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అత్యున్నత అంతర్జాతీయ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన అస్మితా దేకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె ఈ విజయం దేశ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు.కఠోర శ్రమ, అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అస్మితా దే మరోసారి నిరూపించారని మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించి దేశ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

## నామినేటెడ్ పోస్టుల భర్తీపై కాంగ్రెస్...

(మొదటి పేజీ తరువాయి)



ఉమ్మడి జిల్లాలకు నియమించిన ఇన్‌చార్జ్ మంత్రులు ఆయా జిల్లాల్లోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, సీనియర్ నాయకులతో సమావేశాలు నిర్వహించి సమన్వయంతో ఆశావహుల నివేదిక రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.నామినేటెడ్ పోస్టుల్లో 60 శాతం స్థానాలను మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గంలో పనిచేసిన నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గ సీనియర్ నాయకులకు కేటాయించాలని నిర్ణయించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని స్పష్టం చేశారు.అన్ని స్థాయిల్లో సంప్రదింపులు పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేసిన అనంతరం ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు కలిసి నియామకాలపై తుది నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.







# మంగపేటలో గోదావరి వరద ఉధృతిని పరిశీలించిన మంత్రి సీతక్క

- మూడో ప్రమాద హెచ్చరికకు చేరువలో గోదావరి.. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం
- లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలను స్వయంగా పరిశీలించిన మంత్రి సీతక్క
- వరద నీరు తగ్గే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి సీతక్క సూచన
- ముంపు బాధితులకు అన్ని విధాల సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం




**ములుగు జిల్లా వెలుతురు ఆగస్టు 01:**

శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి మంగపేట లో గోదావరి వరద ప్రవాహాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వరద ముంపు ప్రాంతాల బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు.ఈ సందర్భంగా మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు.ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నందున, నది పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులను పరామర్శించిన మంత్రి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి ,తహసిల్దార్ తోట రవీందర్ స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పత్రిక స్వేచ్ఛను కేంద్రం హరిస్తుంది: మహేష్ కుమార్ గౌడ్

- నవతెలంగాణ 11వ వార్షికోత్సవంలో టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలు
- మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమని స్పష్టీకరణ
- భావ ప్రకటనా స్వేచ్ఛను అణిచివేయడం సరికాదని వ్యాఖ్య
- బాధ్యతాయుతమైన జర్నలిజం అవసరమని పిలుపు



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:**

నవతెలంగాణ 11వ వార్షికోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పత్రికా స్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని ఆరోపించారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమని, దానిని బలహీనపరిస్తే చివరకు ప్రజాస్వామ్యమే నష్టపోతుందని అన్నారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛ కల్పించిందని, పత్రికా స్వేచ్ఛ ఏ ప్రభుత్వానికీ ఇచ్చిన వరం కాదని, అది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని పేర్కొన్నారు. దేశంలో భిన్నాభిప్రాయాలను అణిచివేసే పరిస్థితులు నెలకొన్నాయని, విమర్శిస్తే దేశద్రోహం అనే ముద్ర వేయడం, ప్రశ్నిస్తే శత్రువులుగా చూడడం, మీడియాపై ఒత్తిళ్లు తీసుకురావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.సోషల్ మీడియా విస్తరణతో పాటు ఫేక్ న్యూస్ కూడా పెరుగుతోందని, అందుకే బాధ్యతాయుతమైన జర్నలిజం అవసరమని సూచించారు. మీడియా ప్రభుత్వాల మంచి పనులను ప్రజలకు తెలియజేయడంతో పాటు తప్పులను కూడా నిర్భయంగా ఎత్తిచూపాలని కోరారు.రాజ్యాంగం శాశ్వతమని, ప్రభుత్వాలు శాశ్వతం కావని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి రాజకీయ పార్టీ, ప్రజాప్రతినిధి, పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కేంద్రం నుంచి నిధులు సాధించేందుకు అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

# హైడ్రా అభివృద్ధితో జలకళ సంతరించుకున్న ఉప్పల్ నల్లచెరువు



- త్వరలో ప్రజలకు అందుబాటులోకి చెరువు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 1:**

హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ పనులతో ఉప్పల్ నల్లచెరువు మళ్లీ జలకళ సంతరించుకుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులోకి పెద్దఎత్తున వరద నీరు చేరడంతో చెరువు నిండుకుండలా మారింది. గతంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి మురికి కూపంగా మారిన ఈ చెరువు ఇప్పుడు పునరుద్ధరణ పనుల ఫలితంగా కొత్త రూపును సంతరించుకుంటోంది.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హైడ్రా ముందస్తుగా చేపట్టిన పనులు ఫలితాన్నిచ్చాయి. వరద నీరు చెరువులోకి చేరేలా ప్రత్యేక ఇన్లెట్లను అభివృద్ధి చేయడంతో పాటు, మురుగు నీరు ప్రత్యేక బైపాస్ కాలువ ద్వారా బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేసింది. దీంతో ఇటీవల కురిసిన వర్షాల సమయంలో ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా వరద నీరు నేరుగా నల్లచెరువులోకి చేరింది.ఉప్పల్ నల్లచెరువులో గతంలో ఉన్న 10 ఎకరాలకు పైగా ఆక్రమణలను హైడ్రా తొలగించింది. దీంతో చెరువు విస్తీర్ణం సుమారు 70 ఎకరాలకు పెరిగింది. ప్రస్తుతం రూ.20 కోట్ల వ్యయంతో చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నారు.నాచారం చెరువుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సులభంగా నల్లచెరువుకు చేరేలా రెండు ఇన్లెట్లను నిర్మించారు. అలాగే చెరువు పూర్తిగా నిండిన తర్వాత అదనపు నీరు సాఫీగా మూసీ నదిలోకి వెళ్లేలా ఔట్లెట్‌ను కూడా అభివృద్ధి చేశారు. దీంతో వరద నిర్వహణ మరింత సమర్థవంతంగా మారనుంది.చెరువును కేవలం నీటి నిల్వకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, బలమైన మెయిన్ బండ్, పిల్లల కోసం ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. కుటుంబాలు విశ్రాంతిగా గడిపే వినోద కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు.హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న కీలక చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటి. ఇప్పటికే మూడు చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన హైడ్రా.. త్వరలో ఉప్పల్ నల్లచెరువును కూడా నగరానికి మరో అందమైన జలవనరుగా, పర్యాటక ఆకర్షణగా మార్చేందుకు పనులను వేగవంతం చేస్తోంది.

# తల్లి పాలే శిశువుకు తొలి టీకా – ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 1:**



ప్రపంచ తల్లి పాల వారోత్సవాల (ఆగస్టు 1–7) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి తల్లి, ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాముఖ్యతను చేరవేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.తల్లి పాలు ప్రతి శిశువుకు తొలి హక్కు, ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ పోషకాహారమని మంత్రి పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి రోగనిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలను ప్రారంభించడం, తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వడం, అనంతరం వయస్సుకు తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు తల్లిపాలను కొనసాగించడం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి చెప్పారు.తల్లి పాల వారోత్సవాలను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించే ఉద్యమంగా నిర్వహించాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, గ్రామాలు, వార్డుల్లో అవగాహన సమావేశాలు, ఇంటింటి సందర్శనలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి తల్లిపాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, సూపర్వైజర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలు, ఆరు నెలల లోపు శిశువుల తల్లులు, రెండేళ్ల లోపు పిల్లల తల్లులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శాస్త్రీయ అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని కోరారు.ప్రసవం జరిగిన ప్రతి ఆసుపత్రిలో పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు అందేలా వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తల్లి పాల ప్రోత్సాహంలో అంగన్వాడీ వ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం తల్లి శిశు ఆరోగ్యానికి మార్గదర్శక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. పోషకాహార లోపం లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి శిశువుకు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి పాలే బలమైన పునాది అని అన్నారు.ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, వైద్యులు, మహిళా సంఘాలు, అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ప్రతి కుటుంబం భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజమంతా బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

# ఉజ్జయిని మహాకాళి బోనాలకు సర్వం సిద్ధం

- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు
- ఆలయం చుట్టూ 2 కిలోమీటర్ల మేర ఆంక్షలు
- ఆగస్టు 1 అర్ధరాత్రి నుంచే సాధారణ వాహనాలకు నిలిపివేత
- తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా ఉజ్జయిని మహాకాళి బోనాలు
- పుట్టింటికి వచ్చే అమ్మవారికి భక్తుల నైవేద్యంగా బోనం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 1:**

తెలంగాణ రాష్ట్రంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతరను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో పోలీసులు విస్తృత స్థాయిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆగస్టు 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఆలయం చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో సాధారణ వాహనాల రాకపోకలపై ఆంక్షలు అమల్లో ఉంటాయని నగర ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం వెల్లడించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆగస్టు 4వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు జాతర ముగిసే వరకు ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలను నిలిపివేసి, ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తున్నట్లు తెలిపారు.జాతర సందర్భంగా ప్రధాన కడపలలో నిర్వహించే మార్గాల మళ్లింపు వివరాలను పోలీసులు విడుదల చేశారు. పాట్నీ క్రాస్ రోడ్స్, ఎస్‌బీఐ, ప్యారడైజ్ జంక్షన్ల నుంచి ట్యాంక్ బండ్ వైపు వెళ్లే వాహనాలను మినిస్టర్ రోడ్, క్లాక్ టవర్, సంగీత్ థియేటర్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, చిలకలగూడ, ముషీరాబాద్ మరియు కవాడిగూడ మీదుగా పంపుతారు. ప్యారడైజ్ నుంచి బైబిల్ హౌస్ వైపు వెళ్లే వాహనాలను ఎస్‌బీఐ లేదా క్లాక్ టవర్ వైపుగా మళ్లిస్తారు.ఘస్మండి, బైబిల్ హౌస్ మరియు కర్బలా జంక్షన్ల వద్ద కూడా ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. బైబిల్ హౌస్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను సజ్జన్‌లాల్ స్ట్రీట్, హిల్ స్ట్రీట్ లేదా రాణిగంజ్ మీదుగా మళ్లిస్తారు. జబ్బార్ కాంప్లెక్స్, బన్సీలాల్‌పేట్ నుంచి వచ్చే వాహనాలను కర్బలా, రాణిగంజ్ వైపు పంపుతారు. చిల్డ్రన్స్ పార్క్, బైబిల్ హౌస్ వైపు నుంచి వచ్చే వాహనాలను కర్బలా వద్ద నుంచి రాణిగంజ్ క్రాస్ రోడ్స్ వైపు మళ్లిస్తారు.అలాగే రాణిగంజ్, ప్యారడైజ్ మార్గాల్లో రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు మరియు సాధారణ వాహనాల కోసం ప్రత్యేక రూట్లు కేటాయించారు. కర్బలా మైదాన్ నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను మినిస్టర్ రోడ్, రసూల్‌పురా, పీఎన్ టీ ఫ్లైఓవర్, సీటీవో, ఎస్‌బీఐ, వైఎంసీఏ, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్, గోపాలపురం మీదుగా మళ్లిస్తారు. రైల్వే స్టేషన్ నుంచి ట్యాంక్ బండ్ వైపు వెళ్లే బస్సులను చిలకలగూడ, గాంధీ హాస్పిటల్, ముషీరాబాద్, మారియట్ హోటల్ మీదుగా పంపుతారు. సీటీవో నుంచి ఎంజీ రోడ్ వైపు వెళ్లే వాహనాలను సింధీ కాలనీ, మినిస్టర్ రోడ్ మీదుగా మళ్లిస్తారు.బోనాల పండగకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నగర పోలీసులు పలు ప్రాంతాల్లో వాహన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. హరిహర కళాభవన్, యశోద హాస్పిటల్ సమీపంలో, మహబూబ్ కాలేజీ, సీఎంఆర్ షాపింగ్ మాల్, పాత జైలు ఖానా ఖాళీ స్థలం, ఇస్లామియా హైస్కూల్, ప్రభుత్వ అడవయ్య మెమోరియల్ హైస్కూల్, నల్లగుట్ట జీహెచ్ఎంసీ గ్రౌండ్, ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం పరిసరాలు, పార్సీ టెంపుల్, వెస్లీ కాలేజీ, జీహెచ్ఎంసీ జింఖానా గ్రౌండ్, స్వప్నలోక్ కాంప్లెక్స్ మరియు తాజ్ త్రీ స్టార్ లైన్లలో పార్కింగ్ వసతి కల్పించారు.జాతర సమయంలో ప్రయాణికులకు లేదా భక్తులకు ఏదైనా ట్రాఫిక్ సంబంధిత ఇబ్బందులు ఎదురైతే తక్షణ సహాయం కోసం ప్రత్యేక ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626 ను అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికులు ఈ నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని, ఆంక్షలు అమల్లో ఉన్న సమయంలో వాహనదారులు పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ అధికారులు కోరారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే ఆషాఢ మాసంలో బోనాల జాతర ఎంతో వేడుకగా జరుగుతుంది. ఆషాఢంలో కొత్తగా వివాహమైన అమ్మాయిలు పుట్టింటికి వెళ్లడం తెలుగువారి ఆచారం. నిత్య పెళ్లికుమార్తె అయిన ఉజ్జయిని మహాకాళి అమ్మవారు ప్రతీ ఆషాఢ మాసంలో తన పుట్టింటికి వస్తారని భక్తుల ప్రగాఢ నమ్మకం. కన్న కుమార్తె తమ ఇంటికి వస్తుందనే భావనతో భక్తులు అమ్మవారికి ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాల రూపంలో నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి ఆలయానికి సుమారు 200 సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. శక్తికి అధిదేవతగా కొలువబడే మహాకాళి అమ్మవారు ఇక్కడ భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందారు. ఉజ్జయిని బోనాల సందర్భంగా తెలంగాణ నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.



### విద్యార్థుల్లో జర్నలిజం నైపుణ్యాలకు పదును..

## గీతాంజలి దేవకుల్ పాఠశాలలో ఘనంగా 'ఇంటర్ హౌస్ జూనియర్ న్యూస్ రూమ్' పోటీలు

**కూకట్ పల్లి, ఆగస్టు 1 (వెలుతురు) :** కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని గీతాంజలి దేవకుల్ పాఠశాలలో శనివారం "ఇంటర్ హౌస్ జూనియర్ న్యూస్ రూమ్" పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు నాలుగు హౌస్‌ల తరపున పాల్గొని వార్తా వాచకం, జాతీయ--అంతర్జాతీయ వార్తలు, క్రీడలు, వాతావరణం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై వార్తలను ప్రొఫెషనల్ యాంకర్లను తలపించేలా ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ మీడియా సంస్థ ది టైమ్స్ గ్రూప్‌లో ఎడిటర్--ఇన్వెస్టిగేషన్స్‌గా సేవలందిస్తున్న సుధాకర్ రెడ్డి ఉడుములతో కలిసి ఆమె పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే విద్యార్థులు స్పష్టమైన ఉచ్చారణ, ధైర్యం, ఆత్మవిశ్వాసంతో వార్తలను ప్రదర్శించడం



అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమకాలీన అంశాలపై అవగాహనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమాన్ని విజయవం తంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందాన్ని ఆమె అభినందిం చారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల ందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, విజేతలు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ప్రిన్సిపాల్ శ్రీలేఖ సురేష్, హెడ్‌మిస్ట్రెస్ వసంత మండలి, సెంట్రల్ ఆఫీస్ అడ్వైజర్ అంజలి శర్మ, ఉపాధ్యాయులు అవంతి, హసీనా, ప్రణీత, ఇర్ఫానా, దివ్య శ్రీ, సీమ, యాస్మిన్, అంకిత, శ్రీలక్ష్మి పూర్ణ కుమారి, విజయలక్ష్మిను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

### బోనాల పండుగకు ప్రభుత్వ అండ..

## కూకట్ పల్లిలో 138 ఆలయ కమిటీలకు ఆర్థిక సహాయ నిధుల చెక్కుల పంపిణీ

**కూకట్ పల్లి, ఆగస్టు 1 (వెలుతురు) :** తెలంగాణ రాష్ట్ర ఆషాఢ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణకు అందజేస్తున్న ఆర్థిక సహాయ నిధుల చెక్కులను కూకట్ పల్లి నియోజకవర్గంలోని 138 ఆలయ కమిటీలకు శనివారం పంపిణీ చేశారు. భరత్‌నగర్ లోని శ్రీ హరిహర క్షేత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బండి రమేష్, కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుష్పా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, ఆలయ కమిటీల అధ్యక్షులకు ప్రభుత్వ ఆర్థిక సహాయ నిధుల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప ఆధ్యాత్మిక ఉత్సవమని పేర్కొన్నారు. జగజ్జనని అమ్మవారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని



ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలుపుతోందని అన్నారు. ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి కొనసాగుతోందని ఆయన తెలిపారు. బోనాల వంటి సంప్రదాయ పండుగలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఆలయాల నిర్వహణకు మరింత తోడ్పాటునిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ ఆలయ కమిటీల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## మ్యాన్‌హోల్ మరమ్మత్తు పనులు త్వరితగతిన చేపట్టాలి

### మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సూచన

**శేర్లింగంపల్లి, ఆగస్టు 1 (వెలుతురు):** శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ మాధవరం నగర్ కాలనీలోని నాగార్జున స్కూల్ ఎదురుగా దెబ్బతిన్న సేవరేజ్ మ్యాన్‌హోల్ కారణంగా రోడ్డుపై ఏర్పడిన ప్రమాదకర గుంతను మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు మేనేజర్ అనిల్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవరం రంగారావు మాట్లాడుతూ, సేవరేజ్ మ్యాన్‌హోల్ దెబ్బతినడంతో నీరు రహదారి కింది భాగంలోకి చేరి రోడ్డు కుంగిపోవడంతో పెద్ద గుంత ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితి స్థానిక ప్రజలు, విద్యార్థులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున అధికారులు అత్యవసరంగా స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టి సమస్యను



శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులు సమస్యను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రావు, విజయ్ సాగర్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

### గాగిల్లాపూర్ తాండ--2లో ఘనంగా నిర్వహించిన

## శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు) ఆగస్టు 01:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధి గాగిల్లాపూర్ తాండ--2లో ఘనంగా నిర్వహించిన శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ బోనాల మహోత్సవాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అమ్మవారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, సిద్ధునోళ్ల సంజీవరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోట్ల విజయ్ కుమార్, కె. భిక్షపతినాయక్, ఎల్. శ్రీనునాయక్, డి.రాజు నాయక్, డి.నెహ్రూ నాయక్, కె. హనుమంతు నాయక్, ఎల్.ప్రేమ్ సింగ్ నాయక్, టి.శ్రీను నాయక్, కె.ప్రవీణ్ నాయక్, కె.కన్నా నాయక్, ఆర్.కుమార్ నాయక్, కె.స్వామి నాయక్, డి.గణేష్ నాయక్, జె.నరేందర్



నాయక్, కె.మదన్ నాయక్, డి.విజయ్ నాయక్, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన మౌలిక

## వసతులు కల్పించడం లక్ష్యం: ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఆగస్టు 01:** 278 - గాజులరామారం డివిజన్ పెద్దమ్మ నగర్ బస్తీ (1.12 కోట్ల రూపాయలు) అయ్యప్ప కాలనీ (90 లక్షల రూపాయలు) లలో సీసీ రోడ్ల నిర్మాణానికై నిధులు మంజూరైన సందర్భంగా ఆయా బస్తీలు, కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యేకి కాలనీవాసులు గజమాల, డప్పుల దరువుల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...పెద్దమ్మ బస్తీలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి పైప్ లైన్, వీధి దీపాల వంటి మౌళిక వసతుల సదుపాయాలతో అభివృద్ధి పరిచామని, అతి త్వరలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కూడా ప్రారంభించి పెద్దమ్మ నగర్ ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ కళ్యాణ్, జలమండలి డీజిఎం రవినాయక్, మేనేజర్ రమ్య భారతి, పెద్దమ్మ నగర్ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ డి.నవీన్, జనరల్ సెక్రటరీ రమేష్, వైస్ ప్రెసిడెంట్ మనోహర్, కోశాధికారి ఆరిఫ్, పరశురాం, జాయింట్ సెక్రటరీ జీ.శ్రీనివాస్, సంక్షేమ సంఘం సభ్యులు గోపాల్, స్థానిక నాయకులు పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, మహిళా నాయకురాల్లు రాధాభాయిలు పాల్గొన్నారు.

## నిరుపేద వీధి వ్యాపారుల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ) ఆగస్టు 01** :ఎన్నో ఏళ్లుగా రోడ్డు పక్కన చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న నిరుపేద వీధి వ్యాపారుల జీవనాధారాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోంది. ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చిన్న వ్యాపార సముదాయాలను కూల్చివేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శనివారం ఉదయం ××జ కాలనీ నుండి రాజీవ్ గాంధీనగర్ వరకు ఉన్న వీధి వ్యాపార సముదాయాలను జవీజ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేస్తుండగా, వెంటనే జవీజ డివిజన్ దీ=ూ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ సంఘటన స్థలానికి చేరుకుని అధికారులను నిలదీశారు. అనంతరం ఈవిషయాన్ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లి స్థానికంగా బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కనీసం రెండు వారాల పాటు కూల్చివేతలను నిలిపివేసి, వీధి వ్యాపారులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి



చేశారు. స్పందించిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడి, తాత్కాలికంగా కూల్చివేతలను నిలిపివేయించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, ఇస్మాయిల్, జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు...

- అదనపు సమయాన్ని నాణ్యత పెంపునకు వినియోగించాలి
- భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్
- ఎస్ఐఆర్ అమలుపై రంగారెడ్డి జిల్లా అధికారులతో సమీక్ష
- జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం -- అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన




**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 01:** భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, లభించిన అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశానికి హాజరైన భారత ఎన్నికల సంఘం కార్యదర్శికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు. సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం కార్యదర్శి మాట్లాడుతూ, ఇప్పటి వరకు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని ప్రశంసించారు. ప్రారంభంలో రాష్ట్ర సగటుతో పోలిస్తే డిజిటైజేషన్ వేగం తక్కువగా ఉండటంతో పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం అదనంగా ఏడు రోజుల గడువు కల్పించిన నేపథ్యంలో, ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫోటోలు, పత్రాల అప్‌లోడ్ తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ధారించాలని సూచించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యతను ధృవీకరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్న చోట వాటినే పోలింగ్ కేంద్రాలుగా వినియోగించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేట్ భవనాలను ఉపయోగించాలని స్పష్టం చేశారు. మరణించిన, చిరునామా మార్చుకున్న లేదా గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కుటుంబ సభ్యులు, స్థానిక సమాచారం ఆధారంగా పూర్తిస్థాయిలో ధృవీకరించాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో వచ్చే అభ్యంతరాలు, నోటీసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. అవసరమైతే అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి పనిభారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు గుర్తించలేకపోతున్నామని, బీఎల్‌వోలు అందుబాటులో లేరనే ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి వస్తున్నాయని పేర్కొంటూ, అలాంటి సందర్భాల్లో బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి సహకారం అందిస్తూ అవసరమైన దరఖాస్తులు స్వీకరించి ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందని, ఇదే ఉత్సాహంతో మిగిలిన ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేసి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని, ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 1,056 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. శేరిలింగంపల్లి, ఎల్.బీ.నగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం వంటి పట్టణ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో మ్యాపింగ్ ప్రక్రియ సవాలుగా మారిందన్నారు. కొన్ని గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు రెండు జిల్లాల పరిధిలో ఉండటంతో ప్రత్యేక సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 63.53 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, గ్రామీణ నియోజకవర్గాల్లో మంచి పురోగతి నమోదవుతుండగా, పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్, అనామలీస్, డూప్లికేట్, నో మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడం జిల్లాకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ అదనపు సమయాన్ని పూర్తిగా వినియోగించుకొని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి పెండింగ్ కేసులను సంయుక్తంగా ధృవీకరించి, అవసరమైన చోట ఓటర్లను నేరుగా సంప్రదించి వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో ఇప్పటికే విస్తృత సమావేశాలు నిర్వహించి అపోహలను తొలగించామని, మరోసారి ఈఆర్‌వో స్థాయిలో సమావేశాలు నిర్వహించి మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సాధ్యమైనంత వరకు అదే కమ్యూనిటీల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని, ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటే లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం నుంచి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించడం వల్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నమోదయ్యేలా అత్యున్నత నాణ్యతతో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, అదనపు కలెక్టర్ కె. కిరణ్మయితో కలిసి కొంగర, బొంగులూరు, ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, ప్రజల స్పందన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈఆర్‌వోలు, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సిరిపురం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు ఆగస్టు 01:** గ్రామం సిరిపురం జెడ్పీహెచ్ఎస్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, సిరిపురం గ్రామ జెడ్పీహెచ్ఎస్ నందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శిరీష ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమై, వారికి న్యాయ అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగ విలువలు, ప్రాథమిక విధులు, బాలల హక్కులు, బాలల రక్షణ చట్టాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలపై లైంగిక వేధింపుల నివారణకు సంబంధించిన పిఓసిఎస్ఓ చట్టం, మంచి స్పర్శ -- చెడు స్పర్శ ), మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ, ఉచిత న్యాయ సహాయం , లీగల్ ఎయిడ్ న్యాయాన్ని పొందే హక్కు, సైబర్ భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు.అదేవిధంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సుక్క శ్రవణ్ కుమార్ కూడా పై అంశాలపై విద్యార్థులకు చట్టపరమైన అవగాహన కల్పిస్తూ, వారి హక్కులు, బాధ్యతలు, చట్టాలను గౌరవించే విధానం, సైబర్ నేరాల నుండి రక్షణ, బాలల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విపులంగా వివరించారు. సందేహాలు అడిగిన విద్యార్థులకు సమాధానాలు ఇచ్చి, చట్టాలపై ఆసక్తి పెంపొందేలా ప్రోత్సహించారు.కార్యక్రమం అనంతరం న్యాయమూర్తి శిరీష విద్యార్థులను వివిధ అంశాలపై ప్రశ్నించి, సరైన సమాధానాలు చెప్పిన వారికి ప్రోత్సాహకంగా పెన్నులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సభ్యులు శ్రీశైలం , పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల్లో న్యాయ అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.



# మోత్కూరులో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- మిషన్ భగీరథ నీటి సమస్యపై సమీక్ష.. కేజీబీవీలో పాఠశాల సమస్యలపై ఆరా



**మోత్కూర్, ఆగస్టు 01, వెలుతురు :** మోత్కూరు మున్సిపాలిటీ లో అదనపు కలెక్టర్ భాస్కరరావు శనివారం ఆకస్మికంగా పర్యటించి పలు ప్రాంతాలను పరిశీలించారు. ముందుగా మోత్కూర్ చెర-ువుకట్టపై మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి, మరమ్మతుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మున్సిపాలిటీలో తలెత్తిన తాగునీటి సమస్యపై ఎంపీడీవో కార్యాలయంలో మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల క్రితం నీటి సమస్యతో మహిళలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన నేపథ్యంలో సమస్యకు గల కారణాలు, తీసుకున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీనిపై మిషన్ భగీరథ ఏఈ నితిన్ రెడ్డి సమస్యను ఇప్పటికే పరిష్కరించినట్లు అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మోత్కూర్ కేజీబీవీని సందర్శించిన భాస్కరరావు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. ఇటీవల కేజీబీవీలో ఏర్పడిన నీటి సమస్యపై కూడా విచారించారు. మరో బోరు అవసరమని ఇన్‌చార్జి యాదమ్మ వివరించగా, అవసరాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం సమయంలో ఎండలో కూర్చుని భోజనం చేయాల్సి వస్తోందని తెలుసుకున్న అదనపు కలెక్టర్, పాఠశాల లోపలి భాగంలో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుని భోజనం చేసేందుకు త్వరలోనే షెడ్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. తరగతి గదుల్లో అదనపు ఫ్యాన్ల అవసరంపై కూడా స్పందిస్తూ వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ జి. నర్సయ్య, ఎంపీడీవో బాలాజీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కామ్రేడ్ పిట్టల శ్రీను ఆశయాలను సాధిద్దాం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 01:** పిట్టల శ్రీను రెండవ వర్ధంతి సందర్భంగా రామన్నపేట పట్టణ కేంద్రంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్లు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు. మరియు పట్టణ కార్యదర్శి మునుకుంట్ల లెనిన్ మాట్లాడుతూ కామ్రేడ్ విట్టల శ్రీను రామన్నపేట పట్టణంలో యువతి యువకులను సమీకరించి స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటం చేసే వ్యక్తి. నీ కోల్పోవడం చాలా బాధకరంగా ఉందని పిట్టల శ్రీను కుటుంబానికి సిపిఎం పార్టీ అండగా ఉంటదని .అతనుమనకుదూరమైన ఆయన ఆశయాలు మన ముందు ఉన్నాయని. రామన్నపేట పట్టణంలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు యువతి యువకులు ప్రజలు.ముందు వరుసలో నిలబడి పోరాటం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బావల్ల పెళ్లి బాలరాజు గాదె నరేందర్ సినియర్ నాయకులు అముద ఆంజనేయులు మహిళా సంఘం మండల నాయకురాలు పాల్వశీచ లక్ష్మి, పిట్టల పద్మ, పల్లె సత్యం, బావల్ల పెళ్లి సత్యం, బొల్ల వెంకన్న, రాసాల రమేష్, కడారి రాములు, కుందూరు వెంకటేశ్వర్లు,ాల్వంచ.ప్రతాప్, స్నేహ, లింగుస్వామి పాల్గొన్నారు.

# గెజిటెడ్ అధ్యాపకులు జిల్లా కార్యదర్శి గా ఎన్నికైన డాక్టర్ టి. కిషన్ కు సన్మానం

రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 01: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డి.కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ గతంలో కూడా జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా కిషన్ పనిచేసి మూడవ పర్యాయం మళ్లీ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమని అన్నారు. నిరంతరం సభ్యుల సమస్యల పరిష్కారం చేయడంలో ముందుండాలని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది కిషన్ ను అభినందించారు.



# నాగార్జున లో ముందస్తు స్నేహితుల దినోత్సవం

నూతనకల్, ఆగస్టు 01 (వెలుతురు): మండల కేంద్రంలోని నాగార్జున ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో విద్యార్థులు శనివారం ముందస్తు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ఒకరికి ఒకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్లను కట్టుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పా-ఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లప్పుడూ స్నేహంగా ఒకరినొకరు కలిసిమెలిసి ఉండాలని సూచించారు.విద్యార్థులకు స్నేహ భావాన్ని పెంపొందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మారగాని విజయలక్ష్మి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గుర్రం యాదగిరి గౌడ్,మొగుళ్ల వెంకటనారాయణ,బిక్కీ రామన్న,మహమ్మద్ మతిన్, నల్లగొండ వెంకట్,మొగుళ్ళ మధుసూదన్,సౌమ్య, ప్రియాంక,రాజేశ్వరి,సునీత, ప్రియాంక,హేమలత,పావని, స్వప్న,శ్రీలత,సంధ్య,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# చట్ట సభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



- సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి.

మోత్కూర్, ఆగస్టు 01,వెలుతురు న్యూస్ : చట్ట సభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని శనివారం నాడు బీసీ హక్కుల సాధన సమితి మండల మహాసభ మోత్కూర్ కేఆర్ భవన్లో దొండ రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బీసీలు అన్ని రంగాలలో ముందు ఉండాలని రాజకీయంగా చైతన్యవంతులు కావాలని బీసీలంతా ఐక్యంగా ఉండాలని ,బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టాలని ,స్థానిక సంస్థలలో ఇచ్చినట్టుగానే బీసీ రిజర్వేషన్ చట్టసభలలో బీసీ రిజర్వేషన్ కల్పించాలని వారు,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తదనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా పోచం కన్నయ్య, ఉపాధ్యక్షులుగా దొండ రాములు, ప్రధాన కార్యదర్శిగా, పెండెమ్ వెంకటేశ్వర్లు ,సహాయ కార్యదర్శి ,అంబటి సోమ-య్య ,కోశాధికారి తాడూరు లక్ష్మీ నరసయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు అన్నెపు వెంకట్ ,చాపల అంజయ్య ,దొండ ఎల్లయ్య బి నర్సయ్య, భువనగిరి ముత్యాలు ,బోయిని వెంకన్న, తొట్ల యాదగిరి కొళ్ళు లక్ష్మయ్య, ఎలుగు బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల మండలంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఎంపిక



**నార్కట్ పల్లి వెలుతురు ఆగస్టు 01:** చిట్యాల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మేడి శంకర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు భవిష్యత్తులో అసమానతలు, వివక్షత లేని సమాజ నిర్మాణం కోసం జరిగే పోరాటంలో యావత్ మాదిగ జాతిని ఏకం చేయాల్సిన బాధ్యత నూతన కమిటీలపై ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాత కమిటీలను రద్దు చేసిన అనంతరం, చిట్యాల మండలానికి నూతన కమిటీని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీ౹ూ ం మీ౹ూ జిల్లా నాయకులు ఎరసాని గోపాల్ మాదిగ, మీ౹ూ మండల అధ్యక్షుడు నోముల పురుషోత్తం మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నక్క కృష్ణ మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు జోగు సురేష్ మాదిగ, నల్లబెల్లి రమేష్ మాదిగ, జోగు లింగస్వామి మాదిగ, సుక్క నరసింహ మాదిగ, పెరిక లింగస్వామి మాదిగ, బోయ దేవి వరప్రసాద్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.అనంతరం



ఎమ్మార్పీఎస్ నూతన చిట్యాల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

నూతన కమిటీ సభ్యులు: మండల అధ్యక్షుడు: పోలిమేర దశరథ్ మాదిగ

అధికార ప్రతినిధి: ఎరసాని లింగస్వామి మాదిగ

ప్రధాన కార్యదర్శి: జోగు ప్రవీణ్ మాదిగ

ఉపాధ్యక్షులు: ఉష్కిల రవి మాదిగ, జోగు నగేష్ మాదిగ

కార్యదర్శులు: మాంకాల శ్రీను మాదిగ, అంబాల నవీన్ మాదిగ

సహాయ కార్యదర్శి: మేడి లింగస్వామి మాదిగ

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సమావేశంలో పాల్గొన్న నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి, సంస్థ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఇంద్రపాలనగరం గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 01:** గ్రామం ఇంద్రపాలనగరం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గర్దాస్ విక్రమ్ మాట్లాడుతూ గర్భిణీలు ప్రసవం అయిన అర్ధగంట లోపే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ఎంతో శ్రేష్ఠమైనవి మరియు, జీవితకాలం ఆరోగ్యావంతంగా ఉండేందుకు ధోహధపడతాయాని గర్భిణీ లను ఉద్దేశిస్తూ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో సిపిడిఓ వెంకటరమణ పంచాయతీ కార్యదర్శి నరేందర్ , సూపర్ వైజర్ సుజాత, పోషణ అభియాన్ అశోక్ , అంగన్వాడీ టీచర్లు, ఆశాలు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.


# న్యాయ వ్యవస్థను కించపరుస్తున్న ప్రభుత్వం

- బి. ఆర్. ఎస్ పార్టీ మోత్కూర్.

**మోత్కూర్, ఆగస్టు 01,వెలుతురు :** హైడ్రకమిషనర్ రంగనాథ్ ను వెంటనే తొలగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చినప్పటికీ ప్రభుత్వం ఇంతవరకు తొలగించలేదంటే రేవంత్ రెడ్డి న్యాయవ్యవస్థను ఎంతలా కించపరుస్తున్నాడో ప్రజలు గమనించాలని మోత్కూర్ మాజీ మార్కెట్ కమిటీ చేర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, పట్టణ అధ్యక్షులు జంగశ్రీనివాస్,రైతు బంద్ మాజీ అధ్యక్షులు కొండా సోంమల్లు కోరారు . హైడ్రాఅంటే పేదలఇళ్ళుకూల్చుతు పెద్దోళ్ల ఇండ్లను కాపాడుతూ, వారినుండి కోట్లరూపాయలు వసూలు చేస్తూ, ఢిల్లీకాంగ్రెస్ పార్టీకి కప్పంగడుతూ, ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడం కోసమే హైడ్రా అని,హైడ్రా ను అడ్డంపెట్టుకొని రేవంత్ ఆడుతున్న అతిపెద్ద ఆర్థిక డ్రామా అని అన్నారు.రేవంత్ రెడ్డికి తనశాఖల మీదనేకాదు ఏ శాఖల మీద కూడా పట్టులేదని ఒక్కమంత్రి కూడా ముఖ్యమంత్రి మాటవినక తెలంగాణ రాష్ట్రము కుక్కలు చింపిన విస్తరిలా తయారయిందన్నారు. 60 సంవత్సరాల ఆంధ్రపాలన కంటే ఈ 3 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగం అయిందన్నారు.



### కీర్తిశేషులు బత్తుల నరసింహ కుటుంబం నకు 50.000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన ఏఐటియుసి యూనియన్



**మునుగోడు ఆగస్టు 01 (వెలుతురు) :** శనివారం రోజున పలివెల గ్రామంలో ఏఐటీయూసీ ఆల్ డ్రైవర్స్ యూనియన్ పలివెల ఆధ్వర్యంలో కీర్తిశేషులు బత్తుల నరసింహ చనిపోవడం కావున తోటి డ్రైవర్లు అందరూ కలిసి యూనియన్ తరపున 50000 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ అధ్యక్షులు మార్త నర్సిరెడ్డి బత్తుల యాదయ్య గోస్కొండ సైదులు గోస్కొండ స్వామి వార్డ్ నెంబర్ పంతంగి రవి గోస్కొండ స్వామి బత్తుల లింగస్వామి బత్తుల కృష్ణ నిశాంతు రాజిరెడ్డి వివిధ డ్రైవర్లు అందరూ పాల్గొనడం జరిగినది.

## జహీరాబాద్ మండలంలో 96 శాతం ఎస్ఐఆర్ పూర్తి

- డిలీషన్ ఫారాలపై బీఎల్ఏలు ఇప్పుడే సంతకాలు చేయొద్దు
- జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.నరసింహారెడ్డి



**జహీరాబాద్ ఆగస్టు 1 (వెలుతురు):** జహీరాబాద్ మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 96 శాతం పూర్తయిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పి.నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు సహకరించిన బీఎల్ఓలు, బీఎల్ఏలు, సూపర్‌వైజర్లు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మండలంలో ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించామని చెప్పారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి గాంధీభవన్ నుంచి తాజా మార్గదర్శకాలు వచ్చాయని, ఎస్ఐఆర్‌కు ఇంకా గడువు ఉన్నందున డిలీషన్ ఫారాలపై పార్టీ నిర్ణయించిన బీఎల్ఏలు ఇప్పుడే సంతకాలు చేయవద్దని సూచించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ రాములు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షు డు ఇమామ్ పటేల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్య దర్శి జగదీశ్వర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిలీప్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

### చింతకుంటలో వనమహోత్సవంలో
## మొక్కలు నాటిన కేంద్ర మంత్రి బండి సంజయ్, మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 01:** ఃకరీంనగర్ నగరంలోని చింతకుంటఃా బుల్స్ మెన్ సెంట్రల్ వద్ద నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారితో కలిసి నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ కుమార్ గారు, మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. 'క్లీన్ సిటీ -- గ్రీన్ సిటీ' లక్ష్యంతో నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, పచ్చని కరీంనగర్‌ను అందించేందుకు ప్రజలందరూ వనమహోత్సవ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలని





కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా వారు



ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (ఖు) పి హరి ప్రసాద్ గారు , డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ వా సత్యనారాయణ గారు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గారు, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు, కార్పొరేటర్లు,ఆర్పీలు, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో 'ఫీజు బకాయి.. బీజేపీ లడాయి'

- పెండింగ్ ఫీజులు వెంటనే విడుదల చేయాలి
- బీజేవైఎం కన్వీనర్లు సోమ అనిల్, నరేష్ పాటిల్

**జహీరాబాద్ ఆగస్టు 1 (వెలుతురు):** బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఫీజు బకాయి.. బీజేపీ లడాయి' కార్యక్రమా న్ని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలంలోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం కన్వీనర్లు సోమ అనిల్, నరేష్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు సంబంధి చిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,



ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో న్యాల్కల్ మండల అధ్యక్షుడు నర్సింలు, ఉపాధ్యక్షులు రాజు, సందీప్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు నిలిపివేస్తే కళాశాలలపై చర్యలు తీసుకోవాలి...
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వై. నరోత్తం డిమాండ్..

**జహీరాబాద్ ఆగస్టు 1 (వెలుతురు):** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు వై. నరోత్తం డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాలకు పైగా బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ ఒరిజినల్ సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.7,000 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ విద్యా సర్టిఫికెట్లు నిలిపివేయకుండా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందేలా ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని నరోత్తం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, రాంచంద్రారెడ్డి



తదితరులు పాల్గొన్నారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:**

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు. కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఫైనల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ & రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ మీదుగా ఏర్పాటు చేయాలి

- వ్యాపార, పారిశ్రామిక రంగాలకు మరింత ఊతం
- కాంగ్రెస్ నాయకులు గంకటి శుక్లవర్ధన్ రెడ్డి

**జహీరాబాద్ ఆగస్టు 1 (వెలుతురు):** ముంబై-- హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ మీదుగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు గంకటి శుక్లవర్ధన్ రెడ్డి కోరారు. న్యాల్కల్, ఝరాసంగం మండలాల్లోని 13 గ్రామాల పరిధిలో 12,600 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలు రానున్న నేపథ్యంలో జహీరాబాద్ కీలక వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోందన్నారు. బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ మీదుగా వస్తే ముంబై, పుణే, నాసిక్, బెంగళూరు, చెన్నై, వైజాగ్ వంటి నగరాల నుంచి వ్యాపారవేత్తల రాకపోకలు పెరిగి స్థానికంగా వ్యాపారం, రవాణా, లాజిస్టిక్స్ రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు.



ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను జహీరాబాద్ మీదుగా తీసుకురావడం ద్వారా ప్రాంతానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని శుక్లవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

# తిరుమలలో ఆధ్యాత్మిక శోభ

- ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు
- వాహన సేవల షెడ్యూల్ విడుదల
- బ్రహ్మోత్సవాల తేదీలను ప్రకటించిన టీటీడీ
- సెప్టెంబర్ 14న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- మరుసటి రోజు నుంచే వాహన సేవలు
- ఉదయం, సాయంత్రం మాడ వీధుల్లో వాహన సేవలు
- భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు
- ధ్వజావరోహణంతో ముగియనున్న సాలకట్ల ఉత్సవాలు



**తిరుమల, వెలుతురు, ఆగస్టు 1:**

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య దర్శనం కోసం ఎదురుచూసే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారాన్ని అందించింది. ఈ ఏడాది తిరుమల కొండపై రెండు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయని వెల్లడిస్తూ, సాలకట్ల బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింపజేసే ఈ ఉత్సవాల్లో మొదటివైన 'నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు' సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఆ తర్వాత 'నవరాత్రి బ్రహ్మోత్సవాలు' అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగడంతో బ్రహ్మోత్సవాల ఘట్టం ప్రారంభమవుతుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ శ్రీవారు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రోజువారీ వాహన సేవలు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, అలాగే సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగుతాయని టీటీడీ వివరించింది. దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, స్వామివారి వాహన సేవలను హాయిగా వీక్షించేలా చతుర్మాడ వీధుల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 15న సాయంత్రం వేద మంత్రోచ్ఛారణల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు అధికారికంగా ప్రారంభమవుతాయి. అదే రోజు రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు పెద్ద శేష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. రెండో రోజైన సెప్టెంబర్ 16న ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహన సేవ, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ వైభవంగా జరుగుతాయి. మూడో రోజు సెప్టెంబర్ 17న ఉదయం 8 గంటలకు స్వామివారు దుష్టశిక్షణకు ప్రతీకగా సింహ వాహనంపై దర్శనమిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు ప్రశాంతతకు నిదర్శనమైన ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతారు. నాల్గో రోజైన సెప్టెంబర్ 18న ఉదయం 8 గంటలకు కోరిన కోరికలు తీర్చే కల్పవృక్ష వాహనంపై, రాత్రి 7 గంటలకు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు సర్వభూపాల వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తారు. ఐదో రోజు సెప్టెంబర్ 19 అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజుగా నిలుస్తుంది. ఉదయం 8 గంటలకు స్వామివారు జగన్మోహిని రూపంలో మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆ తర్వాత బ్రహ్మోత్సవాల్లోనే అత్యంత ప్రధానమైన గరుడ వాహన సేవ సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు అత్యంత శోభాయమానంగా సాగుతుంది.

ఈ అపూర్వ ఘట్టాన్ని తిలకించేందుకు తిరుమలకు భారీగా భక్తులు తరలివస్తారు. ఆరో రోజైన సెప్టెంబర్ 20న ఉదయం 8 గంటలకు శ్రీరాముని పరమ భక్తుడైన హనుమంత వాహన సేవ, సాయంత్రం 4 గంటలకు కాంతులీనే స్వర్ణ రథోత్సవం, రాత్రి 7 గంటలకు గజ వాహన సేవలు నిర్వహించనున్నారు. ఏడో రోజు సెప్టెంబర్ 21న ఉదయం 8 గంటలకు ఆరోగ్య ప్రదాత అయిన సూర్యప్రభ వాహనం, మధ్యాహ్నం స్నపనం, రాత్రి 7 గంటలకు ఆహ్లాదాన్ని పంచే చంద్రప్రభ వాహనంపై స్వామి వారు విహరిస్తారు. ఎనిమిదో రోజు సెప్టెంబర్ 22న ఉదయం 7 గంటలకు భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత ఘనంగా రథోత్సవం సాగుతుంది. అదే రోజు రాత్రి 7 గంటలకు అశ్వ వాహనంపై శ్రీవారు ఊరేగుతారు. తొమ్మిదో రోజు, ఆఖరి ఘట్టమైన సెప్టెంబర్ 23న ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆ రాత్రి ధ్వజావరోహణంతో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు మంగళప్రదంగా ముగుస్తాయి.

# కశ్మీర్‌లో ఉగ్రమూకల ఘాతుకం

- వలస కార్మికులపై విచక్షణా రహిత కాల్పులు
- ఇద్దరు వలసకార్మికులు ఇద్దరు మృతి
- ఇటుక బట్టీ వద్ద ముష్కరుల దాడి
- ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యువకుల ప్రాణాలు బలి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- ఘటనా స్థలాన్ని ముట్టడించిన భద్రతా దళాలు
- మూలమూలలా ఉగ్రవాదుల కోసం ముమ్మర గాలింపు



**శ్రీనగర్, వెలుతురు, ఆగస్టు 01:**

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి తమ దారుణ కోరలను ప్రదర్శించారు. కుల్గామ్ జిల్లాలోని కేలం ప్రాంతంలో ఉన్న ఒక ఇటుక బట్టీ వద్ద శుక్రవారం రాత్రి వేళ ఉగ్రమూకలు జరిపిన విచక్షణా రహిత కాల్పుల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు అమాయక వలస కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. రోజంతా కష్టపడి పని ముగించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కార్మికులను లక్ష్యంగా చేసుకుని దుండగులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర భయాందోళనలు వ్యక్తమయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించినప్పటికీ చికిత్స ఫలించక వారు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. కాల్పుల ఘటనలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 20 ఏళ్ల యువకుడు దీపక్ రత్రే తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించే మార్గంలోనే ప్రాణాలు వదిలాడు. తీవ్రంగా గాయపడిన మరో కార్మికుడు బోపిందర్‌ను స్థానిక అనంతనాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. అనంతరం అతడి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం సౌరాలోని ఎస్‌కేఐఎంఎస్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, అక్కడ చికిత్స పొందుతూ అతడు కూడా కన్నుమూశాడు. దీంతో ఈ దాడిలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. ఘటన జరిగిన వెంటనే భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, పారిపోయిన ఉగ్రవాదుల కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ఘటనను జమ్మూ-కశ్మీర్ అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ తీవ్రంగా ఖండించారు. పొట్టకూటి కోసం వచ్చిన అమాయక వలస కార్మికులపై దాడి చేయడం నాగరిక సమాజంలో ఏమాత్రం సమర్థనీయం కాదని, ఇది మానవత్వంపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ప్రశాంతతను, శాంతిభద్రతలను దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రలో భాగమే ఈ పిరికిపంద చర్య అని మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన ఆయన, ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ప్రజలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్ కాంగ్రెస్ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా కూడా ఈ దాడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికేతర కార్మికులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ముష్కరుల బలహీనతకు నిదర్శనమన్నారు. భద్రతా సంస్థలు మరింత అప్రమత్తంగా వ్యవహరించి, ఇలాంటి దుశ్చర్యలు జరగకుండా ముందస్తుగానే అడ్డుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్ రైనా స్పందిస్తూ, ఇది పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు చేసిన దారుణ చర్య అని ధ్వజమెత్తారు. అమాయకుల రక్తాన్ని చిందించడం ద్వారా కశ్మీర్‌లో భయాందోళనలు సృష్టించాలని చూస్తున్నారని, అయితే ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉగ్రవాదంపై పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ భద్రతా దళాలు వేటాడి చట్టం ముందు నిలబెడతాయని ఆయన హెచ్చరించారు. ఇటీవలి కాలంలో లోయలో మళ్లీ ఉగ్రదాడుల సంఖ్య పెరగడం స్థానికంగా పెద్ద ఎత్తున ఆందోళనకు దారితీస్తోంది. అనంతనాగ్ పట్టణంలో కొద్దిరోజుల క్రితం ఒక పోలీసు అధికారిని ఉగ్రవాదులు దారుణంగా కాల్చిచంపిన ఘటన మరవకముందే, పది రోజుల వ్యవధిలోనే కుల్గాంలో ఈ ఘోరం జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. దీంతో భద్రతా బలగాలు లోయవ్యాప్తంగా తనిఖీలను మరింత తీవ్రతరం చేశాయి. గతంలో కూడా కశ్మీర్‌లో స్థానికేతరులు, పంజాబ్, బీహార్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు పలు దాడులకు పాల్పడ్డారు. 2024 ఫిబ్రవరిలో శ్రీనగర్‌లోని షహీద్ గంజ్ ప్రాంతంలో పంజాబ్‌కు చెందిన ఇద్దరు కార్మికులను కాల్చిచంపిన ఘటన కూడా తెలిసిందే. జీవనోపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సామాన్యులపై వరుసగా దాడులు జరుగుతుండటంతో వలస కార్మికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఘటనా స్థలంలో పోలీసులు మరియు సైనిక బలగాలు ఆధారాలను సేకరించి దర్యాప్తు వేగవంతం చేశాయి. ఈ దాడి వెనుక ఏ ఉగ్రవాద సంస్థ హస్తం ఉందనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఘటన నేపథ్యంలో కుల్గామ్ మరియు పరిసర జిల్లాల్లో భద్రతను పటిష్టం చేయడంతో పాటు విదేశీ, వలస కార్మికులు ఉండే ప్రాంతాల వద్ద అదనపు భద్రతా బటాలియన్లను మోహరించారు.

# “ సంగారెడ్డి, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలలో బాలల అక్రమ రవాణాపై నిర్ణయాత్మక జాతీయ ప్రచారాన్ని ప్రారంభించిన స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్)”



**వెలుతురు తెలంగాణ 01 ఆగస్టు 2026 :** ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా, తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలలో బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న గ్రామీణ స్వచ్ఛంద సంస్థ స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), న్యూఢిల్లీ లో ప్రారంభమైన దేశవ్యాప్త “జాతీయ బాలల అక్రమ రవాణా నిరోధక ప్రచారం”లో భాగంగా జిల్లాస్థాయి సమగ్ర బాలల అక్రమ రవాణా నిరోధక ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. బాలలకు సురక్షితమైన జిల్లాలను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం, జిల్లా పరిపాలన, పోలీసు శాఖ, బాలల సంక్షేమ సంస్థలు, పాఠశాలలు, సామాజిక సంస్థలతో సమన్వయంగా పనిచేస్తామని స్కోప్ సంస్థ స్పష్టం చేసింది.

ఈ ప్రచారంలో భాగంగా స్కోప్ సంస్థ చేపట్టనున్న కార్యక్రమాలు:

- **గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం**
- **అక్రమ రవాణా ప్రమాదానికి గురయ్యే పేద, అట్టడుగు, అత్యంత అసురక్షిత కుటుంబాలను గుర్తించడం**
- **అర్హత కలిగిన కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ, సామాజిక రక్షణ పథకాలతో అనుసంధానం చేయడం ద్వారా ఆర్థిక అసురక్షిత పరిస్థితులను తగ్గించడం**



- **పిల్లలు చదువులో కొనసాగేందుకు పాఠశాల హాజరు, బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం**
- **గుర్తించబడిన అక్రమ రవాణాదారులు, వారి నెట్వర్క్లపై చట్టపరమైన చర్యలు, సమన్వయ దాడులు చేపట్టడం**
- **రక్షించబడిన పిల్లలకు పునరావాసం, సమాజంలో గౌరవప్రదమైన పునఃస్థాపనకు సహాయం అందించడం.**

ఈ ప్రకటన న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన నాలుగు రోజుల జాతీయ సదస్సు “బాలల హక్కులు, సామర్థ్యం, శ్రేయస్సు సాధన”లో స్కోప్ సంస్థ పాల్గొన్న అనంతరం వెలువడింది. ఈ సదస్సును జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జెఆర్సి) ఆధ్వర్యంలో నిర్వహించగా, దేశంలోని 782 జిల్లాల నుండి భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జెఆర్సి) అనేది బాలల అక్రమ రవాణా, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, లైంగిక దోపిడీ నిర్మూలన కోసం పనిచేస్తున్న 250కు పైగా పౌర సమాజ సంస్థల జాతీయ వేదిక. 2030 నాటికి అక్రమ రవాణా రహిత భారతదేశాన్ని నిర్మించడం దీని ప్రధాన లక్ష్యం. స్కోప్, జె ఆర్ సి భాగస్వామ్య సంస్థగా గర్వంగా పనిచేస్తోంది. జెఆర్సి, పిల్లలపై జరిగే నేరాలపై ప్రపంచంలోనే అతిపెద్ద చట్టపరమైన కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సదస్సులో సమర్పించిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 2023 నుండి డిసెంబర్ 2025 వరకు దేశవ్యాప్తంగా జె ఆర్ సి, దాని భాగస్వామ్య సంస్థల సమిష్టి కృషి ద్వారా 1,22,516 మంది పిల్లలను అక్రమ రవాణా నుండి రక్షించగలిగారు. ఇది చట్టపరమైన చర్యలు, సమాజాధారిత జోక్యాల ప్రభావాన్ని స్పష్టంగా చూపుతోంది. సదస్సును కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీమతి సావిత్రి ఠాకూర్ ప్రారంభించారు. ఆమె బాలల రక్షణ దేశం ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన బాధ్యతలలో ఒకటని పేర్కొంటూ, పిల్లలను దోపిడీ నుండి రక్షించడంలో పౌర




సమాజ సంస్థల పాత్రను ప్రశంసించారు. “ఒక్క పిల్లవాడి ప్రాణాన్ని కాపాడడం కూడా అత్యంత మహోన్నతమైన సేవ. అనేక చిన్నారులు అక్రమ రవాణాకు గురై తిరిగి తమ ఇళ్లకు చేరుకోలేకపోతున్నారు. అలాంటి పిల్లలు తమను రక్షించే వారిని ఎదురు చూస్తుంటారు. వారిని లైంగిక దోపిడీ నుండి రక్షించే స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు దేవదూతలతో సమానం” అని మంత్రి పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడిన స్కోప్ సంస్థ డైరెక్టర్ డా. బండి సాయన్న, భారతదేశంలో బాలల అక్రమ రవాణా పిల్లల భవిష్యత్తుకు అత్యంత తీవ్రమైన ముప్పుగా కొనసాగుతోందని పేర్కొన్నారు. “ప్రభుత్వ గణాంకాల ప్రకారం సగటున ప్రతిరోజూ ఆరుగురు పిల్లలు అక్రమ రవాణాకు గురవుతున్నారు; మరో ఐదుగురు పిల్లలు బలవంతపు కార్మికత్వంలోకి నెట్టబడుతున్నారు. ప్రతి గంటకు సుమారు పదకొండు మంది పిల్లలు అదృశ్యమవుతున్నారు; వారిలో చాలా మంది చివరకు అక్రమ రవాణా బారిన పడుతున్నారు. ఆయుధాలు, మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం తరువాత మానవ అక్రమ రవాణా ప్రపంచంలో మూడవ అతిపెద్ద సంఘటిత నేరంగా మారింది. మహిళలు, పిల్లలే దీని ప్రధాన లక్ష్యాలు. వాణిజ్య లైంగిక దోపిడీ, బంధిత కార్మికత్వం, ఇతర దోపిడీ రూపాల ద్వారా అక్రమ రవాణాదారులు లాభాలు పొందుతున్నారు. అసంఘటిత రంగంలో బాల కార్మికత్వం అక్రమ రవాణా యొక్క అత్యంత భయంకరమైన రూపాలలో ఒకటి” అని ఆయన తెలిపారు. డా. సాయన్న మాట్లాడుతూ, అక్రమ రవాణాదారులు చాలాసార్లు బయటి వ్యక్తులు కాకుండా స్థానిక సమాజాల్లో పరిచయం ఉన్న వ్యక్తులే ఉంటారని తెలిపారు. వారు పేద కుటుంబాల ఆర్థిక కష్టాలను ఆసరాగా తీసుకొని ఉద్యోగం, చదువు లేదా మంచి భవిష్యత్తు పేరుతో పిల్లలను మోసం చేసి బంధిత కార్మికత్వం, గృహ దాస్యము, ప్రమాదకర పనులు లేదా లైంగిక దోపిడీ వైపు నెట్టివేస్తారని ఆయన పేర్కొన్నారు. “మా ప్రధాన దృష్టి నివారణ, రక్షణ, నేరస్థులపై చట్టపరమైన చర్యలపై ఉంటుంది. ప్రభుత్వ శాఖలు, జిల్లా పరిపాలనతో కలిసి అసురక్షిత కుటుంబాలను గుర్తించి, సామాజిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసి, పిల్లలు చదువులో కొనసాగి అక్రమ రవాణాదారుల బారిన పడకుండా చర్యలు తీసుకుంటాము. అదే సమయంలో రక్షించబడిన పిల్లలకు చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్, విద్యా మద్దతు, పునరావాసం, సమాజంలో గౌరవప్రదమైన పునఃస్థాపనను కల్పిస్తాము” అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పౌరులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాలు, సామాజిక నాయకులు, స్థానిక సంస్థలు బాలల భద్రత, విద్య కోసం ఈ ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని స్కోప్ సంస్థ పిలుపునిచ్చింది. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే అధికారులకు తెలియజేయడం, పేద, ప్రమాదంలో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సంస్థ పేర్కొంది. చివరిగా, బాలల అక్రమ రవాణాను అరికట్టడం సమాజం మొత్తం పంచుకోవలసిన బాధ్యత అని, ప్రతి పిల్లవాడు భద్రత, గౌరవం, స్వేచ్ఛతో ఎదగాలంటే సమాజం, పౌర సమాజ సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థల మధ్య నిరంతర సహకారం అత్యంత అవసరమని స్కోప్ సంస్థ పునరుద్ఘాటించింది.



# ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా వైద్య ,ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:** జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ గారు శనివారం రోజున కంటోన్మెంట్ పరిధిలోని UPHC పికెట్ జూరిస్డిక్షన్‌లో ఉన్న ఆర్తి స్కాన్ సెంటర్ ,టెనెట్ డయాగ్నస్టిక్స్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ రికార్డులు, MRI స్కానింగ్ రిపోర్టులు, సంబంధిత రిజిస్టర్లు, వైద్యుల అనుమతులు, రోగుల వివరాల నమోదు, టారిఫ్ బోర్డులు, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. అలాగేృజూచీణు చట్టం ప్రకారం Form-F, Referral Slips, Consent Forms, Ultrasound Machine Registration, నెలవారీ రికార్డుల నిర్వహణ, ఇతర చట్టబద్ధమైన పత్రాలను



క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అన్ని రికార్డులను ప్రభుత్వ నిబంధనలు , PCPNDT Act మార్గదర్శకాల మేరకు సక్రమంగా నిర్వహించాలని, టారిఫ్ బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని, రోగులకు పారదర్శకంగా నాణ్యమైన నిర్ధారణ సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలకు



విరుద్ధంగా ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్, పిఓసిఈఏ డాక్టర్ వి.సాయి బాబా మరియు వైద్యాధికారి పాల్గొన్నారు.

# మునుగోడు నియోజక వర్గ ప్రజలకు శుభవార్త

కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16 వ విడత ఉచిత కంటి వైద్య శిబిరం

మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు 15 విడతల్లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాలకి హాజరై వివిధ కారణాల వల్ల ఆపరేషన్ చేయించుకోలేని వాళ్ళ తో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి మరొక సువర్ణ అవకాశం.

తేదీ:- ఆగస్ట్ 2,2026 ఆదివారం

వేదిక:- మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

సమయం:- ఉదయం 9 గంటల నుండి గమనిక:- 50 సంవత్సరాల వయసు పైబడిన వారు విధిగా ఆధార్ కార్డుతో పాటు, మీ ఫోన్ నెంబర్, గతంలో మీరుతున్న మందులను కూడా వెంట తీసుకు రాగలరు. ముఖ్య గమనిక:- కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్నని వెంటనే హైదరాబాద్ తీసుకెళ్లి




ఆపరేషన్ చేయించి తీసుకొ స్తారు.. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరు

# జేఎన్టీయూ రిజిస్టర్ గా ప్రొఫెసర్ జయలక్ష్మిని కొనసాగించాలి

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:** జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతూనే ఉందని, ప్రతిష్టాత్మకమైన జెఎన్టియుకు రిజిస్టర్ గా ఒక బీసీ మహిళ జయలక్ష్మి నియమితులైతే ఓర్వలేక కొంతమంది ఆమెను తీసివేయాలనే కుటిల ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి రిజిస్టర్ గా ప్రొఫెసర్ జయలక్ష్మిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పేరుకే కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయమని చెప్పుకుంటుంది గాని ఆచరణలో మాత్రం అగ్రకులాలకి పెద్దపీట వేస్తూ బీసీలను అణగదొక్కాలని చూస్తున్నారని అన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. రిజిస్టర్ గా జయలక్ష్మి గారిని తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహిగా మిగిలిపోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య ఊరి బండి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

# పద్మశాలి టౌన్‌షిప్‌లో ప్రగతి పథం

**టీమ్ నవీన్ గౌడ్ నేతృత్వంలో విస్తృత అభివృద్ధి**

**ఉప్పల్, ఆగష్టు 1 (వెలుతురు):** పద్మశాలి టౌన్‌షిప్ పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడిచిన రెండేళ్లలో (2024--2026) ‘టీమ్ నవీన్ గౌడ్’ ఆధ్వర్యంలో పలు సంక్షేమ, మౌలిక వసతుల కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించబడ్డాయని. కాలనీవాసుల భాగస్వామ్యంతో ప్రాధాన్యతా క్రమంలో అనేక పనులను పూర్తి చేసినట్లు బృందం ప్రతినిధులు ఒక ప్రకటనలో వెల్లడించారు. చేపట్టిన ప్రధాన సంక్షేమ, మౌలిక పనులు శాశ్వత తాగునీటి సాధన: కాలనీలో నీటి ఎద్దడి నివారణకు ప్రజాప్రతినిధులు, వాటర్ వర్క్స్ అధికారులను కలిసి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు. మౌలిక సదుపాయాలు, రోడ్లు: 80 అడుగుల రహదారి డివైడర్‌కు వర్ణాలు అద్దడం, సెంట్రల్ లైటింగ్, ప్రతి వీధిలో విద్యుత్ దీపాల నిర్వహణతో పాటు నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులు పూర్తి చేశారు. పార్కుల అభివృద్ధి: కొండా లక్ష్మణ్ బాపూజీ పార్కులో బోర్‌వెల్, సరిహద్దు గోడ నిర్మాణం చేపట్టారు. సూర్య నారాయణమూర్తి పార్కులో వాకింగ్ ట్రాక్, మొక్కల పెంపకం చేపట్టగా, కబ్జాకు గురవుతున్న వేవ్‌రాక్ పార్కు చుట్టూ రక్షణ గోడ నిర్మించారు. పారిశుధ్యం, భద్రత: చెత్త సేకరణ రుసుమును నెలకు రూ.200 నుండి రూ.150కి తగ్గించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిని అరికట్టేందు కు సీసీ కెమెరాలు, మైక్ వ్యవస్థను అమర్చారు. దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించడంతో పాటు రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు. టౌన్‌షిప్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాబోయే రోజుల్లోనూ సేవా కార్యక్రమాలను కొన సాగిస్తామని టీమ్ నవీన్ గౌడ్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 01:** గ్రామం కొమ్మాయి గూడెం వాస్తవ్యులు కొండగడప సుధాకర్ మరణించిన విషయం తెలుసుకొని బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి 10,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెల్లి లింగస్వామి, సింగు శంకర్ రెడ్డి, రేపాక లింగస్వామి, మచ్చ మహేష్, గురజాల నవీన్ రెడ్డి, దాకోజు నాగరాజ్, కంచి రమేష్,

వీరమల్ల నరసింహ, శ్యామల గణేష్, గురజాల ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు అకాడమిక్ సిలబస్ బోధిస్తూనే, నైతిక విలువలు , ఏది మంచి? ఏది చెడు? అనేది నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు అందరి పై ఉంది జిల్లా సెషన్స్ జడ్జి కమ్ చైర్మన్ బాల భాస్కర్ రావు




**మేడ్చల్ జిల్లా వెలుతురు ఆగస్టు 01:** పిల్లలకు అకాడమిక్ సిలబస్ బోధిస్తూనే, నైతిక విలువలు ఏది మంచి? ఏది చెడు? అనేది నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు అందరి పై ఉందని జిల్లా సెషన్స్ జడ్జి కమ్ ఛైర్మన్ బాల భాస్కర్ రావు అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన చైల్డ్ ప్రొటెక్షన్ పై అవగాహన సదస్సు కార్యక్రమానికి జిల్లా సెషన్స్ జడ్జి కమ్ ఛైర్మన్ బాల భాస్కర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి, జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లల హక్కుల పరిరక్షణ, బాలల చట్టాలపై ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కల్పించే లక్ష్యంతో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ (DLSA), విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో “చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నియమితులైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఒకరోజు అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడం ఎంతో హర్షనీయమన్నారు. చట్ట ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ బాలలే. నేటి సమాజంలో పిల్లల పై ఎన్నో విధాల వేధింపులు, సమస్యలు ఎదుర్కొంటున్నారు, వాటి గురించి మాట్లాడే ధైర్యం పిల్లలలో రావాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలతో మంచి, చెడు గురించి తప్పనిసరిగా మాట్లాడాలన్నారు. పిల్లల్లో పెరుగుతున్న సెల్ ఫోన్/డిజిటల్ మీడియా వినియోగం, డ్రగ్ అబ్యూజ్ ప్రభావంపై నిరంతరం నిఘా ఉంచుతూ వారిని సరైన మార్గంలో నడిపించాలన్నారు. స్కూల్ రికార్డుల్లో ఒక్కరే చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉన్నప్పటికీ, పాఠశాలలోని ప్రతి ఉపాధ్యాయుడూ పిల్లల రక్షణకర్తగా బాధ్యత వహించాలన్నారు. తరగతి గదిలో భౌతికంగా ఉంటూ మానసికంగా గైర్హాజరయ్యే (Mentally absent) విద్యార్థులను గుర్తించి, వారి సమస్యలను గ్రహించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, అవసరమైన మేరకు మార్గదర్శకత్వం (జశీబఅఒవశ్రీఱఅస్త్ర) అందించాలన్నారు. పాఠశాలల్లో పిల్లలపై ఎలాంటి అసభ్యకర సంఘటనలు లేదా వేధింపులు జరిగిన వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు రిపోర్ట్ చేయాలని, పాఠశాల ఇమేజ్ దెబ్బతింటుందనే భయంతో ఘటనలను సర్దుబాటు లేదా సెటిల్మెంట్ చేయడానికి ప్రయత్నిస్తే, సదరు ఉపాధ్యాయులు/యాజమాన్యం కూడా నేరంలో భాగస్వాములుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ అవగాహన సదస్సు ద్వారా కీలక చట్టాలపై శిక్షణ పోక్సో యాక్ట్, జువైనల్ జస్టిస్ యాక్ట్, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం, ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం పై ఉపాధ్యాయులకు



నిపుణులచే అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పిల్లలు దేశ సంపద అని, వారి సమగ్ర వికాసానికి, సురక్షిత భవిష్యత్తుకు విద్యా, పోలీస్, రెవెన్యూ మరియు న్యాయశాఖలు సమన్వయంతో (Inter-Departmental Coordination) పనిచేయా లని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు న్యాయ వ్యవస్థలో న్యాయ సేవలు అందుకోలేని అణగారిన వర్గాల వారి కోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉచిత న్యాయ సేవలు అందిస్తుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లకు చైల్డ్ ప్రొటెక్షన్ యాక్టుల పట్ల అవగాహన ఉండాలనే మంచి ఆలోచనతో ఈ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంతో అనుభవజ్ఞులైన న్యాయ నిపుణులు, జడ్జిలు అందించే అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడమే కాకుండా, మీ మీ స్కూళ్లలో మిగిలిన ఉపాధ్యాయులకు

అవగాహన కల్పించాలన్నారు. మీకేమైన సందేహాలు ఉంటే తప్పనిసరిగా నివృత్తి చేసుకోవాలన్నారు. పిల్లలకు మంచితో పాటు చెడు గురించి కూడా తెలియజేయాలన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో చైల్డ్ ఫ్రేండ్లీ సోసైటీని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రత్నయ్య, కూషాయిగూడ ఎసిపి చక్రపాణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన

## - ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణ చర్యలు

**హుస్నాబాద్ వెలుతురు ఆగస్టు 01:** హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దాదాపు 80కి పైగా ఫోన్ కాల్స్‌కు స్వ-యంగా స్పందించారు. ప్రజలు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రి, సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ సమస్యలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పెండింగ్ అభివృద్ధి పనుల పూర్తి, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఔఎం2చీవఙం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన వేదికగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఔఎం2చీవఙం ప్రతినిధులు మహేందర్, దీక్షిత్, ప్రవీణ్, వేణు, తిరుపతి నాయక్ ,తిరుపతి తదితరులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడం తన బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి సమస్యను బాధ్యతాయుతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



## హౌసింగ్ బోర్డ్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మేయర్ కు బీజేపీ నేత తోట సాగర్ వినతి...

**కరీంనగర్ ఆగస్టు 1 (వెలుతురు):** కరీంనగర్ పట్టణంహౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ 7వ డివిజన్ బీజేపీ నేత తోట సాగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఇక్కడి ప్రాంతంలోని రోడ్ నెంబర్ - 2, శివాలయం ఏరియా రోడ్డు లోతట్టు ప్రాంతాలలో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచిపోతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ఏటా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఈ కష్టాలను శాశ్వతంగా పరిష్కరించ డానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నేత తోట సాగర్ వినతిపై మేయర్ కొలగాని శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఆయా ప్రాంతాలలో పర్యటించి, సమస్యలను పరిశీలించి తగిన



పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు.

# అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలపై చట్టం

- నివేదికకు సెలక్ట్ కమిటీ కసరత్తు
- స్పీకర్ ఛాంబర్‌లో సెలక్ట్ కమిటీ భేటీ
- హేట్ స్పీచ్ బిల్లుపై చర్చ
- వారం రోజుల్లో మరో సమావేశం
- సభ్యుల సూచనలు తీసుకోనున్న కమిటీ
- అన్ని వర్గాల అభిప్రాయాలకు ప్రాధాన్యం
- భావప్రకటన స్వేచ్ఛకు భంగం లేదన్న మంత్రి
- అసెంబ్లీ సమావేశాల్లోనే నివేదిక లక్ష్యం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 1:**



తెలంగాణ అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి ప్రతిపాదించిన చట్టంపై సెలక్ట్ కమిటీ కసరత్తు ప్రారంభించింది. శనివారం అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సమావేశమైన కమిటీ.. హేట్ స్పీచ్, క్రైమ్ బిల్లులపై చర్చించింది. వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు నివేదిక సమర్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది.సెలక్ట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి , కూనంనేని సాంబ శివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు.సమావేశంలో హేట్ స్పీచ్ బిల్లు, క్రైమ్ బిల్లుకు సంబంధించిన ప్రతులను మరోసారి సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. బిల్లులోని నిబంధనలు, వాటిపై సభ్యుల అభిప్రాయాలపై చర్చించారు.సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. వారం రోజుల్లో మరోసారి సెలక్ట్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. తదుపరి సమావేశంలో సభ్యులందరి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తామని చెప్పారు.శాసన సభలో విద్వేషపూరిత ప్రసంగాలను నిరోధించేలా చట్టం తీసుకురావడమే కమిటీ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశంపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు.రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని వివిధ వర్గాల ప్రముఖుల అభిప్రాయాలు కూడా తీసుకుంటామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. వ్యక్తుల గౌరవానికి భంగం కలగకుండా, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేలా నివేదిక రూపొందిస్తామని చెప్పారు.భావప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలిగించకుండా చట్టాన్ని రూపొందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. విద్వేష పూరిత వ్యాఖ్యలను మాత్రమే నియంత్రించేలా నిబంధనలు ఉండేలా సెలక్ట్ కమిటీ పనిచేస్తోందని తెలిపారు.

## పెద్ద సూరారానికి సబ్‌స్టేషన్.. రూ.60 లక్షలతో సీసీ రోడ్లు: కోమటిరెడ్డి

- పెద్ద సూరారంలో మంత్రి పర్యటన
- సబ్‌స్టేషన్‌కు సెప్టెంబర్‌లో శంకుస్థాపన
- రూ.60 లక్షలతో సీసీ రోడ్లు
- మహిళా సంఘాలకు రూ.2.5 కోట్ల రుణాలు
- ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం
- రైస్ మిల్లుల ఏర్పాటుకు చర్యలు
- ప్రతి వారం గ్రామాల్లో పర్యటన

**నల్లగొండ, వెలుతురు, ఆగస్టు 1:**

నల్లగొండ జిల్లా పెద్ద సూరారం గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శనివారం సమీక్షించారు. గ్రామస్తులతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించిన మంత్రి.. గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయడంతో పాటు సీసీ రోడ్లు, మహిళా సంఘాలకు రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కీలక ప్రకటనలు చేశారు.గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని మంత్రి అన్నారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్లతో ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.పెద్ద సూరారం గ్రామానికి కొత్త సబ్‌స్టేషన్ మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు. సెప్టెంబర్ నెలలో శంకుస్థాపన చేసి మూడు నుంచి నాలుగు నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. పెద్ద సూరారం మహిళా సంఘాలకు ఆగస్టు 15న రూ.2.5 కోట్ల రుణాల చెక్కులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలు చిన్న పరిశ్రమలు, రైస్ మిల్లుల వంటి ఆదాయ వనరులు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.చిన్న సూరారం-పెద్ద సూరారం మధ్య రైస్ మిల్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలాల్లో కూడా రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను



లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని మంత్రి కోరారు. గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని, 3 కోట్ల 25 లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి వారం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి చెప్పారు. ఆదివారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్యటించి స్థానిక సమస్యలను సమీక్షించనున్నట్లు వెల్లడించారు.అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన మంత్రి.. పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జానమ్మ, ఉప సర్పంచ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎల్లంపల్లి నీటి విడుదలకు ఉత్తమ్ వెంటనే స్పందించారు: ఆది శ్రీనివాస్



- వరద కాల్వకు నీటి విడుదల
- ఉత్తమ్‌కు ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు
- రాంపూర్ పంపుహౌస్ నుంచి రివర్స్ పంపింగ్
- భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశాభావం
- మూడు నియోజకవర్గాలకు ప్రయోజనం
- రైతులకు ఉపయోగపడనున్న నీటి విడుదల
- మంత్రి స్పందనను కొనియాడిన ప్రభుత్వ విప్

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 1:**

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరద కాల్వకు నీటిని విడుదల చేయాలన్న తన విజ్ఞప్తిపై సాగునీటి శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించారని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాంపూర్ పంపుహౌస్ నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా ఎల్లంపల్లి నీటిని విడుదల చేయడం పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎల్లంపల్లి నీటిని వరద కాల్వకు విడుదల చేయాలని నిన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరగా, ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.రాంపూర్ పంపుహౌస్ నుంచి రివర్స్ పంపింగ్




ద్వారా నీటిని విడుదల చేయడం వల్ల వేములవాడ, కోరుట్ల, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో భూగర్భ జలాల మట్టం పెరిగే అవకాశం ఉందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. దీంతో రైతులతో పాటు ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకున్న సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, సాగునీటి వనరుల వినియోగానికి అవసరమైన చర్యలు కొనసాగుతాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## మహారాష్ట్రను ముంచెత్తుతున్న వర్షాలు

- 7 గంటల తర్వాత చెట్టుపై చిక్కుకున్న వ్యక్తి రక్షణ
- జల్‌గావ్‌లో అంజనీ నది ఉద్ధృతి
- చెట్టుపై చిక్కుకున్న మత్స్యకారుడు

**ముంబయి, వెలుతురు, ఆగస్టు 1:**

మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. జల్‌గావ్ జిల్లాలో అంజనీ నదికి వరద పోటెత్తడంతో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి నది మధ్యలో చిక్కుకుపోయాడు. దాదాపు ఏడు గంటలపాటు చెట్టుపైనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపిన అతడిని ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. మరోవైపు రాష్ట్రంలో మరో ఐదు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.జల్‌గావ్ జిల్లాకు చెందిన సురేష్ భిల్ చేపల వేట కోసం అంజనీ నదిలోకి వెళ్లగా ఒక్కసారిగా వరద ఉద్ధృతి పెరిగింది. స్థానికులు అతడిని గుర్తించి వెంటనే అధికారులకు సమాచారం అందించారు.



వరద ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పరిస్థితిని అంచనా వేసిన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి దాదాపు ఏడు గంటల తర్వాత సురేష్ భిల్‌ను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు శనివారం సెలవు ప్రకటించగా, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షాల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో అవసరమైతే మరిన్ని జాగ్రత్త చర్యలు తీసుకునే అవకాశముంది.

# చేనేత కార్మికులు, సహకార సంఘాల సమస్యల పరిష్కారానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్‌కు వినతిపత్రం



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 01:** చేనేత కార్మికులు మరియు చేనేత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం, అఖిల భారత పద్మశాలి సంఘాల ప్రతినిధులు శనివారం వ్యవసాయ, చేనేత-జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో, అలాగే చేనేత-జౌళి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ సభ్యసాచి ఘోష్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు చేనేత రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి మరియు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రతిపాదించిన ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులతో సమీక్షించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టి నిధుల విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రంలో ప్రధానంగా 14 నెలల థ్రిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ వాటా నిధుల విడుదల, నేతన్న భరోసా రెండో విడత నిధుల మంజూరు, 2026--27 సంవత్సరానికి సంబంధించిన ఉత్పత్తి కార్యక్రమాల తక్షణ జారీ, 60 సంవత్సరాల పైబడిన మరణించిన చేనేత కార్మికుల భీమా బకాయిల చెల్లింపు, సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, నిల్వలో ఉన్న చేనేత వస్త్రాల కొనుగోలు, వ్యక్తిగత రుణాల మంజూరు, పెండింగ్ జియో ట్యాగ్ తక్షణమే మంజూరు చేయాలి, చేనేత కార్మికులకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలి. 50 సంవత్సరాల నుండి జియో ట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికునికి కుటుంబాన్ని యూనిట్ గా కాకుండా వ్యక్తిని యూనిట్ గా తీసుకొని పెన్షన్ లు మంజూరు చేయాలని కోరారు , అర్హులందరికీ చేనేత గుర్తింపు కార్డుల జారీ చేయాలని కోరారు, ముద్రా రుణాల సబ్సిడీని 50 శాతానికి పెంపు, గ్రామసభల్లో సహకార సంఘాల అధ్యక్షులకు ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలను ప్రస్తావించారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైన సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ మంజూరు చేయడం, ప్రభుత్వ వస్త్రాల కొనుగోలుపై గతంలో అమలులో ఉన్న 20 శాతం రిబేట్ పథకాన్ని పునరుద్ధరించడం, ముడిసరుకులు మరియు వస్త్రాలపై జీఎస్టీ తొలగించడం, టెస్కో బకాయిలను వెంటనే చెల్లించడం, వివిధ సంక్షేమ శాఖలకు సరఫరా చేసిన వస్త్రాలకు సంబంధించిన సుమారు రూ.500--600 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయడం, పావలా వడ్డీ పథకం కింద రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మర్తపు మురళి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, టీపీపీఎస్ ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్, టీపీపీఎస్ చేనేత విభాగం అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్, వెల్లంకి చేనేత సహకార సంఘం అధ్యక్షులు మిర్యాల ఉపేందం పాల్గొన్నారు.

## విదేశాల్లో పరిశుభ్రత.. ఇక్కడ చెత్త ఎందుకు?: బాంబే హైకోర్టు ఆగ్రహం

- చెత్త, ఉమ్మిపై హైకోర్టు సీరియస్
- విదేశాల్లో నిబంధనలు పాటిస్తారంటూ వ్యాఖ్య
- పౌరుల బాధ్యత గుర్తు చేసిన ధర్మాసనం
- కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం
- చెత్తతో ఆరోగ్య సమస్యలపై ఆందోళన
- వారసత్వ కట్టడాల నిర్వహణపై అసంతృప్తి
- వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశం



**ముంబయి, వెలుతురు, ఆగస్టు 1:**

ముంబయిలోని డంపింగ్ యార్డులు, కాలుష్యం, విష వాయువులకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు ప్రజల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భారతదేశంలో ఇష్టానుసారంగా చెత్త పడేసి, రోడ్లపై ఉమ్మివేసే వారు.. విదేశాలకు వెళ్లినప్పుడు మాత్రం అక్కడి నిబంధనలను ఎందుకు పాటిస్తారని ప్రశ్నించింది. ప్రజల్లో పరిశుభ్రతపై బాధ్యత పెరగాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.జస్టిస్ జి.ఎస్. కులకర్ణి, జస్టిస్ ఆర్తి సాఠే ధర్మాసనం ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారత్‌లో రోడ్లపై ప్రతిరోజూ చెత్త పడేసే వారు.. విదేశాల్లో చిన్న చాక్లెట్ కవర్‌ను కూడా బయట పడేయడానికి వెనుకాడతారని పేర్కొంది. దేశంలో కూడా అదే బాధ్యతతో వ్యవహరించాలని సూచించింది.వీధులు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా చూసేందుకు పౌరులతో పాటు మున్సిపల్ అధికారుల్లో కూడా అవగాహన పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేసింది.పరిశుభ్రమైన వాతావరణాన్ని కోరుకునే హక్కు.. తమ బాధ్యతను నిర్వర్తించే పౌరులకే ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రోడ్లపై చెత్త వేయడం, ఉమ్మివేయడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలని మున్సిపల్ అధికారులకు సూచించింది.ప్రధాన రహదారులు, వీధుల్లో చెత్త పేరుకుపోవడం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. "మనం నిజంగా నాగరిక సమాజంలోనే జీవిస్తున్నామా?" అని ప్రశ్నించింది.హైకోర్టు భవనం సహా ముంబయిలోని వారసత్వ కట్టడాల పరిసరాల్లో చెత్త నిర్వహణ సరిగా లేకపోవడంపై కూడా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. మున్సిపల్ వాహనాల అస్తవ్యస్త నిర్వహణ వల్ల విదేశీ పర్యాటకులతో పాటు సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది.ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన హైకోర్టు.. అమలు చేసిన చర్యలపై వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని సూచించింది.

## రష్యా నుంచి రెట్టింపైన చమురు దిగుమతులు




### మొత్తం దిగుమతుల్లో 55.3 శాతం..జులైలో భారత్ ఆల్ టైమ్ రికార్డ్..

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల మధ్య రష్యా ముడి భారత్ చమురు కొనుగోళ్లను రికార్డ్ స్థాయిలో పెంచింది. జులై నెలలో రష్యా నుంచి రోజుకు 2.78 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురు దిగుమతి జరిగింది. ఇప్పటి వరకు జరిగిన దిగుమతుల్లో ఇదే ఆల్‌టైం రికార్డ్‌గా నిలిచింది. దేశం మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా 55.3 శాతానికి చేరగా.. జూన్‌తో పోలిస్తే రష్యా సరఫరా 1.8 శాతం పెరిగింది. మొత్తం దిగువ-ంతులు స్వల్పంగా మాత్రమే పెరిగినప్పటికీ రష్యా ప్రధాన సరఫరాదారుగా తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకుంది. ఈఏడాది జనవరిలో 23.4 శాతంగా ఉన్న రష్యా వాటా.. ప్రస్తుతం రెండింతలకు పైగా పెరిగి 55 శాతాన్ని దాటడం విశేషం. రష్యా చమురు సరఫరా పెరగడానికి పలు అంతర్జాతీయ పరిణామాలు కారణమయ్యాయి. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యా రిఫైనింగ్ కార్యకలాపాలు దెబ్బతినడంతో ఎగుమతికి ఎక్కువ ముడి చమురు దుబాటులోకి వచ్చింది. అలాగే అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలు తాత్కాలికంగా తగ్గిన సమయంలో గల్ఫ్ ప్రాంతంలో నిలిచిపోయిన నౌకలు మళ్లీ ప్రయాణం ప్రారంభించడంతో భారత్‌కు సరఫరా సులభమైంది. రష్యా ఇచ్చే డిస్కౌంట్లు బ్యారెల్‌కు కేవలం 2--3 డాలర్లకు తగ్గినా భారత రిఫైనర్లు కొనుగోళ్లు తగ్గించలేదు. పశ్చిమాసియా దేశాల నుంచి కూడా దిగుమ తులు జులైలో కొంత పెరిగాయి. యుఎఇ రోజుకు 4.89 లక్షల బ్యారెల్స్‌తో రెండో అతిపెద్ద సరఫ రాదారుగా నిలిచినప్పటికీ జూన్‌తో పోలిస్తే దాని సరఫరా తగ్గింది. సౌదీ అరేబియా నుంచి దిగుమ తులు మాత్రం 55 శాతం పెరిగి రోజుకు 4.53 లక్షల బ్యారెల్స్‌కు చేరాయి. మరోవైపు అట్లాంటిక్ ప్రాంత దేశాల నుంచి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. వెనిజులా, బ్రెజిల్, అమెరికా నుంచి ముడి చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గగా, నైజీరియా నుంచి మాత్రం దిగుమతులు పెరిగాయి. దీంతో భారత చమురు దిగుమతుల్లో రష్యాపై ఆధారపడటం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

# ఆందోళన ముగిసినా... ఆఫీసులో మరో పరీక్ష!

- జంతర్‌మంతర్‌లో నిరసన తెలిపిన
- జెన్ జీ ఉద్యోగులపై సంస్థల భిన్న వైఖరి

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 1:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రోడ్డుపై నినాదాలు ఆగిపోయినంత మాత్రాన నిరసన ఆగిపోలేదు. మరుసటి రోజు ఉదయం కార్యాలయాలకు వెళ్లిన తర్వాతే చాలా మంది యువ ఉద్యోగులకు అసలు పరీక్ష మొదలైంది. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన పరీక్షా వ్యవస్థ సంస్కరణల కోసం చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న జెన్-జీ విద్యార్థులు, యువ ఉద్యోగులు తిరిగి కాలేజీలకు వెళ్లినప్పుడు, విధుల్లో చేరినప్పుడు కొందరికి ప్రశంసలు లభించగా, మరికొందరు అనుమానాలు, పరోక్ష హెచ్చరికలు, మేనేజర్ల 'లెక్చర్లు' ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితి భారత కార్పొరేట్ రంగంలో ఉద్యోగి వ్యక్తిగత అభిప్రాయాలు, పౌరస్వేచ్ఛ, సంస్థల ప్రతిష్ఠ మధ్య కొత్త చర్చకు తెరలేపుతోంది. న్యూఢిల్లీ : ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో వేలాది మంది విద్యార్థులు, యువ ఉద్యోగులు పరీక్షా వ్యవస్థలో సమూల మార్పులు కోరుతూ మోడీ సర్కారుకు వ్యతిరేకంగా వారాల తరబడి ఆందోళనలు నిర్వహించా రు. ఇందుకోసం కొందరు ప్రత్యేకంగా సెలవులు తీసుకుని వచ్చారు. మరికొందరు ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా ప్రయాణించి వచ్చి మరీ నిరసనల్లో పాల్గొన్నారు. ఎట్టకేలకు మోడీ ప్రభుత్వాన్ని మోకాళ్లపై నిలుచోబెట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను సాధించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఉద్యమం ముగించుకొని అందరూ తమ తమ ఉద్యోగాలు, కళాశాలలకు తిరిగి వెళ్లిన తర్వాత వారికి వేర్వేరు అనుభవాలు ఎదురయ్యాయి.

**'దేశాన్ని మార్చేసి వచ్చావా' అంటూ...**

గురుగ్రామ్‌లోని ఓ ప్రకటన సంస్థలో పనిచేస్తున్న దీపాలి కపూర్ మాట్లాడుతూ... "నిరసన ఎలా జరిగిందని ఎవరూ అడగలేదు. 'దేశాన్ని మార్చేసి వచ్చావా?' అంటూ మేనేజర్ నవ్వుతూ అన్నారు. మేనేజర్ మాటలతో సహోద్యోగులు, సిబ్బంది అందరూ నవ్వారు. నేనూ నవ్వాల్సి వచ్చింది. కానీ మేనేజర్ చేసిన ఆ వ్యాఖ్య వెనుక నన్ను ఎద్దేవా చేసే భావన ఉందని అర్థమైంది" అని తెలిపింది. జంతర్‌మంతర్ నిరసనల్లోనే పాల్గొన్న ఘజియాబాద్‌కు చెందిన మార్కెటింగ్ ఉద్యోగి దీక్షా శర్మకు మాత్రం ఇందుకు భిన్నమైన అనుభవం ఎదురైంది. సహోద్యోగులు ఆమెను అభినందించడమే కాకుండా.. సమాజ సమస్యలపై యువత స్పందించడం అభినందనీయమని సీనియర్ అధికారులు ప్రశంసించినట్టు తెలిపింది. మరోవైపు గురుగ్రామ్‌కు చెందిన ఓ సేల్స్ ఉద్యోగిని మాట్లాడుతూ.. "నాపై క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదు. కానీ రాజకీయాలకు దూరంగా ఉండాలని మేనేజర్ 20 నిమిషాల పాటు లెక్చర్ ఇచ్చారు. అది నాకు ఒక శిక్ష కంటే ఎక్కువగా అనిపించింది" అని వివరించింది.

**సోషల్ మీడియాతో చిక్కులు**

గతంలో ఉద్యోగులు కార్యాలయం బయట ఏమి చేస్తారో సంస్థలకు పెద్దగా తెలియదు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా కారణంగా ప్రతి ఫోటో, ప్రతి ట్వీట్, ప్రతి రీల్, ప్రతి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ఉద్యోగి డిజిటల్ గుర్తింపులో భాగమవుతోంది. చాలా మంది యువ ఉద్యోగులకు నిరసనల్లో పాల్గొనడం ప్రజాస్వామ్యంలో తమ బాధ్యతగా కనిపిస్తుండగా.. కొందరు యాజమాన్యాలు మాత్రం అలాంటి పోస్టులను చూసి ఉద్యోగి సంస్థకు భవిష్యత్తులో సమస్యలు తెస్తాడా? అనే కోణంలో పరిశీలిస్తున్నాయి. దీంతో సోషల్ మీడియాపై మరింత నిఘాను పెంచుతున్నాయి.

**కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాల్**

ఈ చర్చ కేవలం ఒక నిరసన ఉద్యమానికి మాత్రమే పరిమితం కాదు. కార్యాలయంలో ఉద్యోగి అయినంత మాత్రాన పౌరుడిగా స్పందించకూడదని చెప్పలేమనీ, అలాగే తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినంత మాత్రాన ఉద్యోగిగా బాధ్యతల నుంచి తప్పించలేమని విశ్లేషకులు చెప్తున్నారు. అయితే యువత తమ వ్యక్తిగత అభిప్రాయాలను సోషల్ మీడియా ద్వారా బహిరంగంగా వ్యక్తం చేస్తున్న ఈ కాలంలో సంస్థలు అలాంటి ఉద్యోగులను సామాజిక స్పృహ ఉన్న వ్యక్తులుగా చూస్తాయా? లేక సంస్థకు ప్రమాదంగా భావిస్తాయా? అనే ప్రశ్న కార్పొరేట్ ప్రపంచం ముందున్న కొత్త సవాలుగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**నైపుణ్యాలే ముఖ్యం... కానీ...**

ఇన్‌క్రూటర్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అనిల్ అగర్వాల్ ప్రకారం... నియామకాల సమయంలో అభ్యర్థి వ్యక్తిగత రాజకీయ అభిప్రాయాలు, సామాజిక ఉద్యమాల్లో పాల్గొనడం వంటి విషయాల కంటే సంస్థలు ప్రధానంగా



నైపుణ్యాలు, అనుభవం, పనితీరును పరిగణనలోకి తీసుకుంటాయని చెప్పారు. అయితే అభ్యర్థి సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించడం ఇప్పుడు సాధారణ ప్రక్రియగా మారిందని ఆయన అంగీకరించారు. ఉద్యమాల్లో పాల్గొన్నాడనే కారణంతో కాకపోయినా, ఆయన స్వభావం, వ్యవహారశైలి గురించి నియామక బృందం ఒక అభిప్రాయాన్ని ఏర్పర్చుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

**కంపెనీల్లో ప్రత్యేక 'ప్రొటెస్ట్ పాలసీ' ఉందా?**

హెచ్‌ఆర్ నిపుణుల ప్రకారం... చాలా సంస్థల్లో నిరసనల్లో పాల్గొనడాన్ని నేరుగా నిషేధించే ప్రత్యేక విధానం ఉండదు. అయితే ఉద్యోగ నియమావళి (కోడ్ ఆఫ్ కండక్ట్), సోషల్ మీడియా పాలసీ, నైతిక మార్గదర్శకాల ఆధారంగా ఉద్యోగుల ప్రవర్త నను పరిశీలిస్తుంటారు. ఉద్యోగులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చని, అయితే వాటిని అభిప్రాయాలుగా చూప కూడదని, సంస్థ లోగో, బ్రాండ్‌ను దుర్వినియోగం చేయకూడదని ఆ నిబంధనలు స్పష్టం చేస్తాయి.

# మళ్లీ అదే పాట పాడుతున్న ట్రంప్!


- భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది తానేనని పునరుద్ఘాటన
- యుద్ధాన్ని టారిఫ్‌ల హెచ్చరికతో ఆపినట్లు వెల్లడి
- క్యాంప్ డేవిడ్ మీడియా సమావేశంలో మాట్లాడిన ట్రంప్
- టారిఫ్‌ల బెదిరింపుతో వెనక్కి తగ్గాయని వ్యాఖ్యలు
- మూడో దేశం జోక్యం లేదని తేల్చిచెప్పిన భారత విదేశాంగ శాఖ

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 1:**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ రాజకీయాలు, ప్రాంతీయ వివాదాలపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. క్యాంప్ డేవిడ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన పదవీకాలంలో పలు అంతర్జాతీయ ఘర్షణలను విజయవంతంగా నిలిపివేశానని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా భారత్ – పాకిస్థాన్ మధ్య తలెత్తిన తీవ్ర యుద్ధ ప్రాతిపదిక వాతావరణాన్ని తానొక్కడినే ఆపగలిగానని మరోసారి పునరుద్ఘాటించారు. దీంతో పాటు ఇరాన్, ఉక్రెయిన్, గాజా మరియు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) వ్యవహారాలపై అమెరికా వైఖరిని ఆయన సుదీర్ఘంగా వివరించారు.భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర స్థాయిలో ఉద్రిక్తతలు పెరిగి యుద్ధం జరుగుతున్న సమయంలో, ఇరు దేశాల ఉత్పత్తులపై ఏకంగా 250 శాతం టారిఫ్‌లు (దిగుమతి సుంకాలు) విధిస్తామని తాను హెచ్చరించినట్లు ట్రంప్ తెలిపారు. ప్రారంభంలో ఈ హెచ్చరికపై ఇరు దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ, మరుసటి రోజే యుద్ధం విరమిస్తున్నట్లు తనకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనకు స్వయంగా ఫోన్ చేసి, రెండు అణ్వాయుధ దేశాల మధ్య జరగబోయే ఘోర కలాపాన్ని ఆపడం ద్వారా దాదాపు ఐదు కోట్ల మంది ప్రాణాలను కాపాడారని కొనియాడినట్లు ట్రంప్ వెల్లడించారు.అయితే డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ఈ వ్యాఖ్యలను భారత్ ఇప్పటికే పలుమార్లు తీవ్రంగా ఖండించింది. రెండు దేశాల మధ్య తలెత్తిన సైనిక, దౌత్యపరమైన అంశాల్లో ఎలాంటి మూడో దేశం జోక్యం లేదా మధ్యవర్తిత్వం లేదని, భారత్ తన సొంత వ్యూహాలతోనే పరిస్థితులను నియంత్రించామని భారత విదేశాంగ శాఖ స్పష్టమైన ప్రకటనల ద్వారా తేల్చిచెప్పింది.మరోవైపు ఇరాన్‌తో జరుగుతున్న సంప్రదింపులపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ వైఖరిపై తమకు విశ్వాసం తగ్గుతోందని, ఆ దేశ నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ మాట నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు. ఎప్పుడూ చర్చలకు సిద్ధమని చెబుతూనే ఇచ్చిన హామీలను ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ, దౌత్యపరమైన తలుపులు మూసివేయలేదని, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, సీనియర్ సలహాదారులు ఇరాన్ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు.అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) పై అమెరికా తీసుకుంటున్న కఠిన చర్యలపై స్పందిస్తూ, ఈ చర్యలు తనను రక్షించుకోవడానికి ఎంతమాత్రం కాదని ట్రంప్ స్పష్టం చేశారు. ఐసీసీ ప్రస్తుతం తనపై ఎలాంటి విచారణ జరపడం లేదని, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరియు ఇతర మిత్రదేశాల అధికారులపై ఐసీసీ ఏకపక్షంగా తీసుకుంటున్న చర్యలను అడ్డుకోవడానికే అమెరికా ఈ ప్రచారం సాగిస్తోందని వివరించారు.ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై మాట్లాడుతూ, ఉక్రెయిన్‌కు అత్యాధునిక 'పేట్రియట్' ఇంటర్‌సెప్టర్ క్షిపణుల తయారీ లైసెన్స్ ఇచ్చే విషయంలో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ వెల్లడించారు. ఇవి అత్యంత విధ్వంసకరమైన, శక్తివంతమైన ఆయుధాలని, వీటి తయారీ హక్కులను ఇచ్చేముందు చాలా జాగ్రత్తగా ఆలోచించాల్సి ఉందన్నారు. తమ ప్రాథమిక లక్ష్యం మరిన్ని ఆయుధాలు లేదా క్షిపణులను తయారు చేయడం కాదని, రష్యా-ఉక్రెయిన్ మధ్య తక్షణమే యుద్ధం ముగిసి ప్రాంతీయ శాంతి నెలకొనడమేనని ఆకాంక్షించారు. గాజా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన హమాస్ మరియు ఇతర సాయుధ సంస్థలను పూర్తిగా నిరాయుధీకరించేందుకు కుదిరిన ఒప్పందాన్ని ట్రంప్ ఒక "గొప్ప పురోగతి"గా అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక మార్పు వల్ల పశ్చిమ ఆసియాలో స్థిరమైన శాంతి, భద్రతకు కొత్త దారి ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం కూడా ఈ నూతన అవగాహన పట్ల సంతృప్తిగా ఉందని, గతంలో అసాధ్యమని భావించిన శాంతి లక్ష్యం ఇప్పుడు నెరవేరబోతోందని అన్నారు.గాజాలో హమాస్ నిరాయుధీకరణ పూర్తయిన వెంటనే అక్కడ ఒక కొత్త పాలస్తీనా పరిపాలనా యంత్రాంగం ఏర్పడుతుందని ట్రంప్ వివరించారు. అంతర్జాతీయ స్థిరీకరణ బలగాలు, కొత్తగా రూపుదిద్దుకునే పాలస్తీనా పోలీసులతో కలిసి గాజాలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తాయని చెప్పారు. నిరాయుధీకరణ ప్రక్రియ పూర్తవుతున్న కొద్దీ ఇజ్రాయెల్ సైన్యం కూడా గాజా నుంచి క్రమంగా వైదొలుగుతుందని వెల్లడించారు. అయితే ట్రంప్ ప్రకటించిన ఈ ప్రతిపాదనలపై సంబంధిత దేశాలు మరియు అంతర్జాతీయ సంస్థల నుంచి అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది.



# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?






మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పుడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

### జీర్ణవ్యవస్థ


మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



### తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





### సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.


### మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



### బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





### మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



### గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?




ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పుధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.


### ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రొటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రొటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

### గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

### కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

### బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.

### ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

### చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.



సీనియర్ నటి సిమ్రాన్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. గత ఏడాది 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఆమె, ప్రస్తుతం సూపర్‌స్టార్ రజినీకాంత్ సరసన 'ధర్మన్' అనే ప్రతిష్టాత్మక చిత్రంలో కీలక పాత్రలో నటించబోతున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. రాజ్ కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లపై లోకనాయకుడు కమల్ హాసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాగా, ఇటీవల విడుదలైన రజినీకాంత్ ఫస్ట్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. తాజాగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న సిమ్రాన్ ఈ సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా కోసం చిత్ర బృందం మొత్తం ఎంతో కష్టపడి పనిచేస్తోందని, వచ్చే నెల నుంచి తాను కూడా షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు వెల్లడించారు.

## ఆ ప్రతిష్టాత్మక చిత్రంలో నేను భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా

### కొరియన్ కనకరాజు
# ట్రైలర్ డేట్ ఫిక్స్..

సూపర్ స్టార్ రజినీకాంత్ తన 173వ చిత్రంతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'ధర్మన్' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో రజినీకాంత్ 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా ఆయన పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని హిట్ ఇచ్చారు మేకర్స్. దీంతో సినిమాపై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఇక త్వరలో సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 'ధర్మన్'కు సంబంధించి తాజాగా మరో అప్డేట్ కోలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తుంది. ఈ చిత్రంలో ఇప్పటికే సీనియర్ నటి సిమ్రాన్, యంగ్ బ్యూటీ రాశి ఖన్నా భాగం అయినట్లు తెలుస్తుండగా.. తాజాగా మీనాక్షి చౌదరి కూడా ఈ ప్రాజెక్టులో భాగం అయిందని సమాచారం. ప్రస్తుతం డైరక్టర్ అశ్వత్ మారిముత్తు తమిళ స్టార్ శింబుతో 'STR51' కోసం వర్క్ చేస్తున్నాడు. ఇందులో మీనాక్షి చౌదరిని హీరోయిన్‌గా లాక్ చెయ్యగా.. ఇప్పుడు రాబోయే తలైవా 173లో కూడా ఎంపిక చేశారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.



## సెప్టెంబరులో మొదలు.. జనవరికి పూర్తి!



కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా అక్టోబరు నాటికి పూర్తి కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఈ సినిమా దాదాపు ముగింపు దశకు చేరుకుందని.. తాను సెప్టెంబరు నుంచి ఈ చిత్ర నేపథ్య సంగీత పనుల్ని ప్రారంభించనున్నానని తెలిపారు. జనవరి నాటికి ఈ పనులు పూర్తవుతాయని.. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టత ఇచ్చారు. ప్రపంచంతో పాటు కాలాన్ని చుట్టేసే సాహసికుడి కథగా ఈ సినిమా ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. మహేశ్ ఇందులో రుద్రగా.. శ్రీరాముడిగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఆగస్టు 9న ఆయన పుట్టినరోజు నేపథ్యంలో.. ఈ సినిమా నుంచి ఏదైనా కొత్త అప్‌డేట్ బయటకొచ్చే అవకాశమున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## దీపావళికి 'సూర్య 47'

కథానాయకుడు సూర్య ఇటీవలే 'కరుప్పు' సినిమా విజయంతో తదుపరి చిత్రాల విషయంలో జోరు పెంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఆయన... మమితా బైజు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో ప్రేక్షకుల్ని మరోసారి పలకరించనున్నారు. అయితే తాజాగా సూర్య, కథానాయిక నజ్రియా జంటగా రూపొందుతున్న 'సూర్య 47' చిత్రం కూడా విడుదల తేదీని ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని చిత్రబృందం దీపావళికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. దీపావళికి విడుదల ఖరారైతే ఈ ఏడాది సూర్య ఖాతాలో మూడు చిత్రాలు చేరనున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో నస్లేన్ కీలకపాత్ర పోషిస్తున్నాడు.





తాను నటనని కెరీర్‌గా ఎంచుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని అంటోంది అందాల తార ప్రీతి ముకుందన్. ఇటీవల 'బ్లాస్ట్', 'హృదయం మురళీ'లాంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రల్లో కనిపించి ఆకట్టుకుంది ప్రీతి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన మొదటి ఆడిషన్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర సంగతిని పంచుకుంది. "మా ఫ్యామిలీలో అందరం చదువుపైనే ఎక్కువ దృష్టి పెట్టే వాళ్లం. మా వాళ్లు చదువులో నన్ను ఎంతగా ప్రోత్సహించేవారో.. నేను నా మనసుకు నచ్చినట్టు కూడా నడుచుకోవాలని అంతే పట్టుదలతో ఉండేవారు. అందుకే కెరీర్ ప్రారంభంలో కొంత కాలం మోడలింగ్ చేశాను. 18 ఏళ్ల వయసులోనే నాకు ఓ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అప్పుడు నటనపై నాకంత నమ్మకం లేక ఆడిషన్ ఇవ్వలేనని చెప్పేశా. కానీ మా అమ్మానాన్న 'నువ్వు ఇది ఎందుకు ప్రయత్నించకూడదు?' అని ఆడిషన్‌కు వెళ్లమని ప్రోత్సహించారు. దాంతో ఆడిషన్‌లో నా వంతు నేను ప్రయత్నించాను కానీ, ఆ పాత్ర దక్కలేదు. కానీ నా తల్లిదండ్రులు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన క్షణమది. చిత్రపరిశ్రమ ఓ కొత్త ప్రపంచం. మా వాళ్లకి దాని గురించి ఏ మాత్రం తెలియదు కానీ, మనసుకి నచ్చింది చేయమని చెప్పడంతోనే నా ప్రయాణం మొదలైంది. ఆ తర్వాతే నెమ్మదిగా నటన పట్ల అభిరుచి పెరిగి, సినిమాని ప్రేమించడం మొదలు పెట్టాన"ని అంది.

## నాలో ఆత్మవిశ్వాసం నింపిన క్షణం


## ఇది రాముడి యుగానికి ఆరంభం

సినీప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాల్లో 'రామాయణ' ఒకటి. నితేశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రని సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడిగా ఓ ప్రధాన పాత్రలో నటిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. "దేవలోకం.. భూలోకం.. పాతాళ లోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం. రావణ రాజ్యం" అంటూ రావణుడిగా యశ్ చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్.. చూపుతిప్పకోనివ్వని విజువల్స్‌తో ఆద్యంతం కట్టిపడేసింది. "సృష్టికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా.. విష్ణు భగవానుడు అవతారమెత్తి లోకాన్ని రక్షించాడు" అంటూ శ్రీరాముడిగా రణ్‌బీర్‌ను పరిచయం చేసిన తీరు.. ఖడ్గం పట్టిన యోధురాలిలా సీత పాత్రలో సాయిపల్లవిని చూపించిన విధానం ఆకట్టుకున్నాయి. ఇక శూర్పణఖ ముక్కు కోసే ఎపిసోడ్.. సీతాపహరణ సమయంలో రావణుడికి - జటాయువుకు మధ్య సాగిన పోరు.. రామ - రావణ యుద్ధం.. ఇలా ట్రైలర్‌లో కనిపించిన ప్రతి సీక్వెన్స్ సినిమాపై అంచనాల్ని రెట్టింపు చేసేలా ఉంది. టీజర్‌కు వచ్చిన విమర్శల్ని దృష్టిలో పెట్టుకున్న చిత్ర బృందం ఈసారి విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచినట్లు ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్‌ని బట్టి అర్థమవుతోంది. "ఇది రాముడి యుగానికి ఆరంభం" అంటూ ఆఖర్లో వినిపించిన డైలాగ్ ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచింది.

## 'టాక్సిక్'లో నదియా పాత్రను అందుకే ఎంచుకున్నాఅంతా సెట్..?

భిన్నమైన పాత్రల్లో నటించడం తనకిష్టమంటున్నారు బాలీవుడ్ బ్యూటీ కియారా అడ్వాణీ (Kiara Advani). ప్రస్తుతం ఈ భామ 'టాక్సిక్' (Toxic) చిత్రంలో నటిస్తున్నారు. యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో కియారా 'నదియా' అనే పాత్రను పోషిస్తున్నారు. అయితే, గతంలో ఈ సినిమాలోని 'తబాహీ' పాట, పోస్టర్‌తో పాటు కియారా పాత్రపై కొన్ని విమర్శలు వచ్చాయి. సామాజిక మాధ్యమాల్లో దీనిపై పెద్ద చర్చ నడిచింది. ఈ విమర్శలను ఆమె కొట్టిపారేసినప్పటికీ.. అసలు ఆ పాత్రను ఎందుకు ఎంచుకోవాల్సి వచ్చిందో కియారా తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ చెప్పిన కథ తనపై ప్రభావం చూపిందని తెలిపారు.

"కథ విన్నప్పుడు నా పాత్రను తీర్చిదిద్దిన విధానం చూసి ఆశ్చర్యపోయాను. ఒక నటిగా నేను కోరుకునే అన్ని కోణాలు ఆ పాత్రలో ఉన్నాయి. ఒకే పాత్రలో బలం, బలహీనత, పిచ్చి, సున్నితత్వం ఇలా అన్ని భావాలను చూపించే అవకాశం దక్కింది. ఇలాంటి పాత్ర చేయడం ప్రతి నటికీ ఓ కల. నా కెరీర్‌లో ఇలాంటి క్లిష్టమైన పాత్రను పోషించగలననే ధైర్యం కలిగింది. అందుకే ఈ పాత్రని వెంటనే ఎంచుకున్నా. మహిళలను ఒకే తరహా పాత్రల్లో బంధించి చూపించడం నాకిష్టం ఉండదు.





Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com